# 2వ డివిజన్‌లో శ్రీనివాసరెడ్డి, మాధవిరెడ్డి ప్రచారం

కడప వైద్యవిభాగం, జనవరి 29, ప్రభాతవార్త



కడప నగరంలోని 2వ డివిజన్‌లో ఆదివారం 2వ డివిజన్ ఇన్‌ఛార్జి కొంగాని శ్రీనివాసులు యాదవ్, సుదర్శన్‌రెడ్డి, కృష్ణయ్య యాదవ్ ఆధ్వర్యంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీని వాసరెడ్డి, కడప తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆర్.మాధవిరెడ్డి బాబు స్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహిం చారు. అనంతరం వారు ప్రజలకు చంద్రబాబునాయుడు మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేసి తెదేపాను వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తెదేపా నేతలు గోవర్ధన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సుదర్శన్, పార్వతి, సునీత, సుబ్బ రాయుడు పాల్గొన్నారు.


వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

మంగళవారం 30 జనవరి 2024


# తాగునీటి కోసం నిరసన

ములకలచెరువు, జనవరి 29 ప్రభాతవార్త:




తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ సోమవారం మొలకలచెరువు ఎంపిడిఓ కార్యాలయం ఎదుట చౌడసముద్రం పంచాయితీ కనికలతాండా వాసులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళలు గత రెండు నెలలుగా తాగునీటి కోసి ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కూలిపనులకు వెళ్ళ లేక వ్యవసాయబోర్ల నుంచి అవస్థలు పడి తెచ్చుకొంటున్నామని వాపోయారు. అనంతరం ఎంపిడిఓ పోలప్పకు మహిళలు వినతిపత్రం అంజేశారు. మహిళలు నిరసన వ్యక్తంచేయడంతో సర్పంచ్ స్పందించి కనికలతాండా వాసులకుతాగునీటి సమస్య పరిష్కారం చేశారు. ఈ కార్యక్రమంలో కమలమ్మ, జయమ్మ, సుజాత, నాగులమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

## 10 నిమిషాల్లో ఇంటికి వెళ్లాల్సిన వారు అనంతలోకాలకు...





రాజంపేట అర్బన్, జనవరి 29 ప్రభాతవార్త

వడ్రంగి పనిచేసుకొని వచ్చిన డబ్బులు చేతపట్టుకుని ఇంటికి బయలుదేరారు ఇరువురు వ్యక్తులు. వారు ఇరువురు బావా బామర్దులు. ఓ ద్విచక్ర వాహనం మీద ఇంటికి వెళుతుండగా మృత్యువు ఇరువురి ప్రాణాలను లారీ రూపంలో కబలించింది. వివరాల్లోకి వెళితే రాజంపేట మండలం బోయనపల్లె వైజంక్షన్ వద్ద, బైపాస్ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాంలో లారీ - బైకు ఢీకొన్న దుర్ఘటన చోటు చేసుకుంది. ఈ దుర్ఘటనలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు. మృతులు రాజంపేట మండలం గుండ్లూరు పంచాయతి అన్నవారిపల్లెకు చెందిన పంచదార రమణయ్యఆచారి(60), బ్రహ్మయ్య,ఆచారి(60)గా స్థానికులు గుర్తించారు. వీరు రాజంపేటలో వడ్రంగి(కంసల ఆచారి) పనిచేసుకుని వచ్చిన డబ్బులు చేతపట్టుకుని ఇంటికి వెళుతున్న సమయంలో వీరు ప్రయాణిస్తున్న మోటారు సైకిల్‌ను ఓ గుర్తు తెలియని లారీ ఢీకొనడంతో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న మృతుల కుటుంబీకులు సంఘటన స్థలానికి చేరుకుని విగత జీవులుగా పడి ఉన్నవారిని చూసి కన్నీరు మున్నీరు అయ్యారు. అయ్యో ఎంతో ఘోరం జరిగిపోయింది అంటూ రోధించారు. మృతులు ఇరువురు బావా బావమరుదులని తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో రాజంపేటకు వస్తున్న టిడిపి జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు 108కి సమాచారం అందించారు. అయితే రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే ఇద్దరు చనిపోవదంతో ట్రాఫిక్ స్తంభించింది. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు సంతాపం తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# నాకు పదవీ కాంక్ష లేదు

## వైసీపీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిలా



కడప వైద్యవిభాగం, జనవరి 29, ప్రభాతవార్త

### వైయస్ఆర్ ఆశయ సాధనలో ఏమాత్రం వెనుకాడను

### గతాన్ని మరిచి వైసీపీ నేతల ఆరోపణలు

### ప్రత్యేక హోదా సాధించే వరకు పోరాటం ఆగదు

వైఎస్ అంటే మాట మీద నిలబడే నాయకుడు. మడమ తిప్పని నాయకుడు.. ఇచ్చిన మాట కోసం, నమ్మిన వారి కోసం ఎంతవరకైనా వెళ్లే నాయకుడు వైఎస్ఆర్. నేను ఆయన బిడ్డను. నేను ఆయన రక్తమే. మాట తప్పను, పోరాటం ఆపను. ఇది నా పుట్టినిల్లు. ఇక్కడి నుంచే చెబుతున్నా ఏం చేస్తారో చేసుకోండి అన్నింటికీ నేను రెడీ అంటూ వైసీపీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిలా ఘటుగా పరుష పదజాలతో విమర్శించారు. కడప, అన్నమయ్య ఉమ్మడి జిల్లాల కాంగ్రెస్ శ్రేణులతో సోమవారం పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్ఆర్ ఆశయాలను పట్టించుకోని జగనన్న వారసుడు ఎలా అవుతారు, వాస్తవాలు చెబితే నాపై ముప్పేట దాడి చేస్తున్నారు. నా సొంత వాళ్లు అనుకొని 3200 కి.మీ పాదయాత్ర చేశా. నా బిడ్డలను ఇంటిని పక్కన పెట్టి వైసీపీని నా భుజాల మీద మోశాను ఇదే వైసీపీ ఇప్పుడు నా మీద దాడి చేస్తోంది. రోజుకో విధంగా జోకర్‌ను తెప్పించి మాట్లాడడం దుష్ప్రచారం చేయడం దారుణమన్నారు. వైసీపీ నేతలు గతాన్ని మరిచి మాట్లాడడం సరికాదన్నారు. నాకు పదవి కాంక్ష ఉంటే నా తండ్రి హయాంలోనే పదవి పొందేదాన్ని. ఏపీకి ప్రత్యేక హోదా వచ్చే వరకు పోరాటం ఆగదని పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి రాజధాని కావాలి. ఇవన్నీ కావాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలి. ఇంది మనందరి బాధ్యత. ప్రతి కార్యకర్త ఒక సైనికుడివలే ఎన్నికల్లో పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సిబ్బందిలో లోపించిన క్రమశిక్షణ..!



అన్నమయ్య ప్రతినిధి - ప్రభాతవార్త

### - అవినీతి మత్తులో మెజార్టీ శాతం ఉద్యోగులు

### - ముడుపులు లేనిదే కదలని ఫైల్స్

### - అవినీతిని ప్రోత్సహిస్తున్న ప్రజాప్రతినిధులు

హక్కుల కోసం పోరాడే ఉద్యోగులు బాధ్యతలు విస్మరిస్తుండడం విచారకరం. నేడు అధికశాతం ఉద్యోగులు అవినీతి మత్తులో పడిపోవడంతో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ముడుపులు లేనిదే ఫైల్స్ కదలని పరిస్థితి ఉంది. అవినీతిని రూపుమాపాల్సిన ప్రజాప్రతినిధులే అధికారత్రయంలో అవినీతిని ప్రోత్సహిస్తుండడం జరుగుతుంది. తమ స్వార్థంతో పాటు సన్నిహితుల ప్రయోజనాల కోసం అక్రమార్జనలో భాగంగా అధికారత్రయంపై ఒత్తిడి తీసుకొస్తుండడం వల్ల కూడా అధికారత్రయంలో అవినీతి పెరిగిపోవడానికి కారణమవుతోంది. ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో, నీతి నిజాయితీగా ఉంటే అధికారత్రయంలో భయంతో పాటు అవినీతికి పాల్పడేందుకు వెనుకాడే పరిస్థితులుండేవి. ప్రజాప్రతినిధులే ప్రజాస్వామ్య విలువలను ప్రక్కన పెడుతుండడంతో అవినీతి జాడ్యం రోజురోజుకు పెరుగుతూ పోతోంది. నేడు అనేకమంది ప్రభుత్వ ఉద్యోగుల్లో తమకు నెలైతే జీతమొస్తుంది, తమను ఎవ్వరూ ఏమీ చేయలేరన్న ధీమా కనిపిస్తుంది. తమ విధి నిర్వహణ సక్రమంగా నిర్వర్తించే విషయంలో అన్నమయ్య జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాల పరిస్థితి రానురాను అధ్వాన్నంగా తయారవుతోంది. ప్రజలకు అందుబాటులో ఉండి సహాయ పడాల్సిన ప్రభుత్వ సిబ్బంది అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నట్టు ఎప్పుడు ఏ ఉద్యోగి ఉంటారో, ఏ ఉద్యోగి ఉండరో తెలియని పరిస్థితితో ప్రభుత్వ కార్యాలయాల్లో పనులుండే వారికి నిత్య సమస్యగా మారింది. వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో అధికార్ల నుండి క్రిందిస్థాయి సిబ్బంది వరకు కార్యాలయ సమయాలను సరిగ్గా పాటించడం లేదు. అధిక శాతం ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది ఎప్పుడు వస్తారో, ఎప్పుడు పోతారో తెలియదు. మధ్యాహ్నానికి నాలుగు గంటలకు కూడా ప్రభుత్వ కార్యాలయాలకు రాని ఉద్యోగులు అధికశాతమున్నారు. ఈ విషయం గురించి పట్టించుకునే వారు లేక పోవడంతో ఉద్యోగులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆయా కార్యాలయాల్లో పనులున్న ప్రజలు బయట పడిగాపులు కాయాల్సి వస్తుంది. ఉద్యోగులు ప్రభుత్వ కార్యాలయాలకు సక్రమంగా వచ్చేందుకు వీలుగా బయో మెట్రిక్‌కు బదులు ఎపిఎఫ్ఆర్ఎస్ విధానాన్ని ప్రభుత్వం ప్రభుత్వ కార్యాలయాల్లోకి తీసుకొచ్చింది. ఎపిఎఫ్ఆర్ఎస్ విధానంలో ఉద్యోగి ముఖం ఈ విధానంలో కనిపించాల్సి ఉంటుంది. అయితే ఉదయం 10 గంటలకు, సాయంత్రం 5 గంటల సమయంలో ఉద్యోగి తమ ముఖాన్ని ఈ ఎపిఎఫ్ఆర్ఎస్ విధానంలో చూపించాల్సి ఉంటుంది. అయితే 10 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు ఉద్యోగికి వెసులుబాటు ఉంటుంది. అందువల్ల ఈ విధానం వల్ల ఒకగూరుతున్న ప్రయోజనం కూడా పెద్దగా లేదు. ఇకపోతే ఎపిఎఫ్ఆర్ఎస్ విధానంలో ముఖం చూపించకపోయినా తగిన చర్యలపై ఇంకా స్పష్టత లేదని తెలుస్తోంది. ప్రజల ముంగిటకు ప్రభుత్వాన్ని తీసుకొస్తామని ప్రభుత్వ ప్రకటన ఏమోకాని అన్నమయ్య జిల్లాలో ఆధికారులు సైతం నెలలో ఎక్కువ రోజులు క్యాంపులు వెళుతుండడం, ఉన్న రోజుల్లో వీరు కూడా సమయాలు పాటించని కారణంగా క్రింది స్థాయి సిబ్బంది సమయాలను పాటించకపోయినా అడగలేని స్థితి ఉంది. దీనికి తోడు వివిధ పనుల్లో అవినీతికి ఉన్నతాధికార్లు పాల్పడుతుండడం వల్ల క్రింది స్థాయి సిబ్బంది పట్ల కఠినంగా వ్యవహరించలేకపోతుండడం జరుగుతుంది. సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించని కారణంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పనులుపూర్తి చేసుకునేందుకు వివిధ వర్గాల ప్రజలు అవస్థలు పడాల్సి వస్తుంది. పలుకుబడి కలిగినవారు. రాజకీయనాయకులైతే ప్రభుత్వ ఆధికార్లు వారి ఇళ్ల వద్దకే వెళ్లి పనులు పూర్తిచేస్తుండడం కద్దు. విధులకు సక్రమంగా హాజరుకాకపోవడానికి ప్రభుత్వ కార్యక్రమాలు కూడా కారణమవుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పలు ప్రభుత్వ కార్యక్రమాల కారణంగా ఉన్నతాధికారులు తమ ప్రభుత్వ కారా ్యలయంలో ఉండడం తక్కువవుతుండడం, మిగిలిన రోజుల్లో క్యాంపు కెళ్ళాల్సి ఉండడం, మండల స్థాయిలో అన్ని రకాల ప్రభుత్వ కార్యక్రమాలు చూసుకోవాల్సిన పరిస్థితి ఉండడంతో తమ ప్రభుత్వ శాఖపై నియంత్రణ తగ్గిపోయేందుకు కారణమవుతోంది. ఈకారణాలతో క్రింది స్థాయి ఉద్యోగుల్లో నిర్లక్ష్యం పెరిగేందుకు కారణమవుతోంది. ఏది ఏమైనా ప్రభుత్వ శాఖల్లో అవినీతిని రూపుమాపేందుకు విధులు పక్రమంగా ఉద్యోగులు నిర్వర్తించేందుకు, సక్రమంగా సమయాలకు కార్యాలయాల్లో అధికార్లు ఉండేలా చర్యలు తీసుకోవాలి.

# 80శాతం గ్రామాల్లో లింకురోడ్డు పనులు పెండింగ్





పులివెందుల, జనవరి 29, ప్రభాతవార్త

అభివృద్ధి పనుల కోసం అంటూ వందల కోట్ల రూపాయలు మంజూరు చేస్తే సరిపోదని, పనులు ఎలా జరుగుతున్నాయో ఆ ఫలాలు ప్రజలకు చేరుతున్నాయా లేదా అని పర్యవేక్షించాల్సిన బాధ్యత కూడా మంజూరు చేసిన వ్యక్తికి ఉంటుందని పశ్చిమ రాయలసీమ జిల్లాల టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అసంబద్ధ పనులను క్షేత్రస్థాయిలో విలేకర్లను పిలిపిచుకుని వెళ్లి ఆయన చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో రూ.110కోట్లతో మొగమూరు నది వెంట వరదకట్టలు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం కోసం నిధులు మంజూరైతే నాలుగు సంవత్సరాలు దాటినా పూర్తికాని దౌర్భాగ్య స్థితిలో ఉన్నామన్నారు. కోవరంగుట్టపల్లె సీపంలో చెక్‌డ్యామ్ నిర్మాణం కోసం రూ.3కోట్లు మంజూరు చేస్తే ఫౌండేషన్ కూడా కాంట్రాక్టరు వేయలేదని, ఎందుకు పనులు చేయలేదో అడిగే పరిస్థితుల్లో ఈ ప్రాంత అధికార యంత్రాంగం ఉందన్నారు. హిమకుంట్ల నుండి పాలగిరి వరకు వరదకట్టలు, రాళ్లతో పిచ్చింగ్ వేయాలనే షరతు ఉన్నా అక్కడక్కడ మాత్రమే కట్టారంటే ఏ మాత్రం అధికారుల పర్యవేక్షణ ఉందో అర్థం అవుతోందన్నారు. పులివెందుల నియోజకవర్గానికి సంబంధించి ప్రజాప్రతినిధి హోదాలో పాడా అభివృద్ధిపైన సమాచారం అడిగితే పాడా ఓఎస్డీ కానీ, జిల్లా కలెక్టరు కానీ సమాధానం ఇవ్వకుండా దాగుడుమూతలు ఆడుతున్నారన్నారు. ప్రైవేటు వ్యక్తులు వేసుకున్న లేఅవుట్‌లో గ్రావెల్ రోడ్డు వేసి బిల్లులు చేసుకున్నారని నిరూపిస్తామని చెబుతున్నా అధికారులు పట్టించుకోలేదన్నారు. మైక్రో ఇరిగేషన్ ద్వారా వేల కోట్లు మంజూరు చేశామని చెప్పుకుంటున్న ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి అదనంగా ఒక్క ఎకరాకు నీళ్లు ఇచ్చిన పరిస్థితి ఉందా అని ప్రశ్నించారు. రూ.650కోట్లతో పులివెందుల పట్టణంలో చేసిన సుందరీకరణ పనుల ఫలాలు ఎవరికి లాభం చేకూర్చాయో చెప్పాలన్నారు. ముద్దనూరు నుండి తాడికొండ చెక్‌పోస్టు వరకు జాతీయ రహదారి మంజూరైతే భూసేకరణలో అవకతవకలు జరిగాయని, ముద్దనూరు నుండి జరుగుతున్న పనులను కేంద్రం రద్దు చేసిందన్నారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద కేంద్రం నిధులతో తారురోడ్డు మూడు సంవత్సరాల క్రితం మంజూరైతే ఆ పనులు చేయని కాంట్రాక్టరు ఫిర్యాదు చేస్తే జరిమానా వేసి సరిపెట్టుకున్నారు తప్ప ఆ పనులు పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. గ్రామాల మధ్య రూ.400కోట్లతో లింకురోడ్లకు నిధులు మంజూరైతే 80శాతం పనులు కూడా పూర్తి కాలేదన్నారు. గృహ నిర్మాణాల కోసం పులివెందుల పట్టణంలో 8వేల ఇళ్లు మంజూరైతే ప్రస్తుతం 8ఇళ్లు కూడా పూర్తి కాలేదన్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణాలు చేపట్టకపోగా వాటి కోసం లబ్ధిదారులు కట్టిన డిపాజిట్లను కూడా వెనక్కు ఇవ్వకుండా వేధిస్తున్నా రన్నారు. నాడు-నేడు కింద వేల కోట్లు మంజూరు చేశామని చెబుతున్న ప్రభుత్వం 50శాతం మౌలిక వసతులు కూడా సొంత ఊరిలో కల్పించలేదంటే ఈ ప్రాంత విద్యార్థులపై ఎంతవరకు ప్రేమ ఉందో అర్థం అవుతోందన్నారు. వీటిన్నింటినీ చూస్తే జగన్ పాలనలో పులివెందుల అభివృద్ధి పురోగమనం బదులు తిరోగమనం చెందిందని, సొంత నియోజకవర్గానికి మేలు చేయని జగన్ రాష్ట్రానికి ఏమి మేలు చేస్తారని, ఇప్పటికైనా ప్రజలు వాస్తవాలు గుర్తించి వచ్చే ఎన్నికల్లో చారిత్రాత్మక తీర్పు ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటరీ కార్యదర్శి బొజ్జా మైసూరారెడ్డి, రైతు విభాగ నాయకులు రమణారెడ్డి, తెలుగు యువత వెంకటేశ్వర్‌రెడ్డి, పాల్గొన్నారు.

# జగనన్న ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్‌లను ప్రారంభించాలి

## ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్



రాయచోటి, జనవరి 29, ప్రభాత వార్త :

జిల్లాలోని అన్ని సచివాలయాల్లో జగనన్న ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్‌లను వెంటనే ప్రారంభించాలని, ఇందుకు తగిన కార్యచరణ చేపట్టాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ అంశంపై విజయవాడ నుంచి రాష్ట్ర భూ పరిపాలనశాఖ కమిషనర్ జి. సాయిప్రసాద్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర భూ పరిపాలన శాఖ కమిషనర్ మాట్లాడుతూ ఫిబ్రవరి రెండో వారంలో ముఖ్యమంత్రిచే లబ్ధిదారులకకు రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. రీ సర్వే పూర్తై ఎల్పీఎం (ల్యాండ్ పార్శిల్ నంబర్) వచ్చిన గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులోకి తెచ్చింది. భూ పరిపాలన శాఖ నుంచి నేడే రిజిస్ట్రేషన్ శాఖకు జగనన్న లేఔట్‌లో స్థలాలు పొందిన అర్హులైన లబ్ధిదారుల డేటా పంపడం జరుగుతుందన్నారు. గ్రామాలలోని సచివాలయాల్లో సులభంగా రిజిస్ట్రేషన్‌లు వెసులుబాటు కలుగుతుందన్నారు. కలెక్టర్లు ప్రాధాన్యత తీసుకొని విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 68 వేల మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరందరికీ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు ప్రక్రియను సజావుగా నిర్వహించాలన్నారు. ఈనెల 30న మంగళవారం ప్రతి సచివాలయాల్లో కనీసం ఒక్క టెస్ట్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయాలన్నారు. ఫిబ్రవరి 9 లోపు రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలి. పొరపాట్లకు ఎక్కడా తావివ్వరాదన్నారు. జగనన్న లేఔట్‌లో ఇంటి స్థలం పట్టా పొందిన లబ్ధిదారులను పంచాయతీ కార్యదర్శి, విఆర్ఓలు, రేపటి నుంచి ఆయా సచివాలయాలకు మొబిలైజ్ చేయాలన్నారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఓ సత్యనారాయణ, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మేడా రఘునాథరెడ్డికి రాజ్యసభ ?

రాజంపేట అర్బన్ జనవరి 29, ప్రభాతవార్త

రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి సోదరుడ ఎంఆర్‌కెఆర్ కన్స్ట్రక్షన్స్ అధినేత మేడా రఘునాథరెడ్డి వైఃసి అధిష్టానం రాజ్యసభకు పంపేం దుకు నిర్ణయించినట్లు తెలిసింది. నేడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారికంగా ప్రకటించనున్నారని సమాచారం. వైసిపి తరపున వైవీ సుబ్బారెడ్డి తో పాటు మేడా రఘునాథరెడ్డి రెండో అభ్యర్థిగా ఉంటారని సమాచారం. సిట్టింగ్ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డికి టికెట్ నిరాకరించినందునందుకు ప్రత్యామ్నా యంగా ఆయన సోదరునికి రాజ్యసభకు అవకాశం కల్పిస్తామని ఇచ్చిన హామీని ఎట్టకేలకు సిఎం హామీని నిలబెట్టుకున్నారు. మరోవైపు మేడా గత రెండు రోజులు గా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నా పార్టీ అధిష్టనం పట్ల అసంతృప్తిగా ఉన్నారు.



సీఎంను కలిసిన సందర్భంగా (ఫైల్ ఫొటో)

# సిసి రోడ్డు వేశారు...క్యూరింగ్ మరిచారు

## - నెర్రెలు చీలిన రహదారి



వీరబల్లి, జనవరి 29, ప్రభాత వార్త :

వీరబల్లి మండలం సోమవరం పంచాయతీ పప్పుకుంట రోడ్డు నుండి తొగటపల్లి వరకు 0.49 కి.మీ రోడ్డును తిరుపతికి చెందిన శేషాచల కన్స్ట్రక్షన్ వారు సిసి రోడ్డు వేశారు. క్యూరింగ్ మరిచారు. దీంతో వేసిన రోడ్డు అంతా నెర్రెలు చీలింది. ఈ పని గత సంవత్సరం మార్చిలో పని ప్రారంభించడం జరిగింది. కానీ మొదటి నుండి కాంట్రాక్టర్ నాసిరకంగా పనులు చేపట్టడం జరిగిందని స్థానికులు తెలిపారు. సిసి రోడ్డు మూడు రోజుల క్రితం వేసి కనీసం నీళ్లు కూడా పోయకుండా అలాగే వదిలేయడంతో రోడ్డు పగుళ్లు ఏర్పడ్డాయి. ఇంత జరుగుతున్నా పట్టించుకోవాల్సిన అధికారులు సైతం మామూళ్ల మత్తులో జోగుతూ కనీసం రోడ్డు వైపు చూసిన దాఖలాలు లేవని స్థానికులు వాపోతున్నారు. దాదాపుగా కోటి రూపాయల అంచనాతో మొదలు పెట్టిన పని ఇలా నాసిరకంగా చేయడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పై అధికారులు స్పందించిత తక్షణమే సిసి రోడ్డు పనులను క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించి సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## బీసీ కులాల పక్షపాతి సీఎం జగన్

కడప వైద్యవిభాగం, జనవరి 29, ప్రభాతవార్త



దేశంలో బీసీ కులాలకు ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా పేద ప్రజలకు సంక్షేమ పథకాలను అందించిన ఏకైక సీఎం జగన్ మోహన్‌రెడ్డి అని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో వారు మాట్లాడుతూ కడప నగరంలో విద్యుత్తు బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 18వ మహాసభలను నిర్వహించారు. ఈ మహాసభలకు రాజ్యసభ సభ్యుడు బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కడప నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు వీర భద్రయ్య, జనరల్ సెక్రటరీ రామకృష్ణ, సర్కిల్ ప్రెసిడెంట్ శ్రీధర్, ఏపీఎస్ పీడీసీఎల్ డిస్కం ప్రెసిడెంట్ మురళీమోహన్, చలపతి, గంగాధర్‌రావు, రామకృష్ణ, రాంబాబు, రవిశంకర్, కోదండరాం, పూర్ణచంద్రరావు, నాగరాజు, రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు, బీసీ నాయకులు, తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## విద్యార్థి స్థాయి చాలా ప్రధానమైనది

### – నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్ శరణి



కడప వైద్యవిభాగం, జనవరి 29, ప్రభాతవార్త

నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి రాబోయే 10వ తరగతి పరీక్షల్లో చక్కని ఫలితాన్ని సాధించడానికి జీవితంలో అత్యున్నతమైన ప్రమా ణాలను అందుకోవడానికి విద్యార్థి స్థాయి చాలా ప్రధాన మైనదని నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్ శరణి అన్నారు. సోమవారం సఫల్తా కా రాస్తా రోడ్ టు సక్సెస్ విజయవంతమైన 2వ ఎడిషన్ సగర్వంగా నిర్వహి స్తున్నా మన్నారు. కార్యక్రమంలో కడప జిల్లాల ఎంఈఎంలు రాజు, శ్రీనివాస్, శంకర్ రెడ్డి, నజీర్, కడప జిల్లాల ఆర్ఐలు రామకృష్ణ శర్మ, కిరణ్‌కుమార్, మల్లికార్జున, ఆర్ఐ, హెడ్ నగేష్, కోఆర్డినేటర్లు, ప్రిన్సిపాళ్లు, ఇన్‌ఛార్జిలు, ఏవోలు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## మన టీడీపీ యాప్‌లో అగ్రస్థానం

రామాపురం, జనవరి 29, ప్రభాతవార్త



తెదేపా అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో రాయచోటి నియోజకవర్గం మన టీడీపీ సోషల్ మీడియా కార్యకర్తలు చురుగ్గా పార్టీకి పని చేసినందుకు గుర్తింపుగా పార్టీ అధ్యక్షులు సైకిల్ గుర్తు బహుమతులు పంపించారు. వాటిని సోమవారం రాయచోటి నియోజకవర్గం టీడీపీ ఇన్‌ఛార్జి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా పార్టీ సైకిల్ గుర్తును బహుమతిగా అందించారు. మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి రామకృష్ణగౌడ్, మండల తెలుగు యువత అధ్యక్షులు నాగభూషణ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం రామాపురంలో వారు మాట్లాడుతూ ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు మన టీడీపీ సోషల్ మీడియాలో చురుగ్గా పాల్గొన్న 20 మందికి బహుమతులు అందజేశారు. రామకృష్ణగౌడ్, నాగభూషణ్ రెడ్డి, గణేష్, చెన్నూరు బాబు, కిరణ్ నాయుడులకు అందజేశారు. సందర్భంగా రమేష్‌కుమార్‌రెడ్డి సోషల్ మీడియా కార్యకర్తలను అభినందించారు.

## చౌడమ్మ వృద్ధాశ్రమంలో న్యాయవిజ్ఞాన సదస్సు

కడప లీగల్, జనవరి 29, ప్రభాతవార్త

డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులచే చౌడమ్మ వృద్ధాశ్రమంలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సును సీనియర్ సివిల్ జడ్జీ ఎస్.బాబాఫకృద్దీన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు మరియు వయోవృద్ధుల పోషణ మరియు సంక్షేమ చట్టం 2007 మరియు ఏపీ తల్లిదండ్రుల వయోవృద్ధుల పోషణ సంక్షేమ నియమావళి 2011ను వివరించారు. తల్లిదండ్రులను తమ బిడ్డలు బాగా చూసుకోవాలని లేనిపక్షంలో శిక్షార్హులవుతారన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్‌ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్, సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు.

## బీఈడీ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్, జనవరి 29, ప్రభాతవార్త

బీఈడీ ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు కౌన్సిలింగ్ పూర్తికాక మునుపే ఇష్టానుసారంగా మేనేజ్‌మెంట్ సీట్లు భర్తీ చేశారని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి శ్రీనాథ్‌యాదవ్, డీవైఎఫ్ఐ నగర అధ్యక్షుడు షాకీర్, పీడీఎస్‌యూ నగర కార్యదర్శి గణేష్‌లు ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌన్సెలింగ్ అడ్మిషన్ ప్రక్రియ పూర్తి కాకముందే మేనేజ్‌మెంట్ సీట్లు భర్తీ చేయడం ఏంటని ప్రశ్నించారు. సంబంధిత కళాశాలలపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కనీస వసతులు లేకుండానే కళాశాలలను నిర్వహించడం శోచనీమన్నారు. కార్యక్రమంలో విద్యార్థి యువజన సంఘాల నాయకులు మదన్‌రెడ్డి, వరప్రసాద్, శ్రీకాంత్, గిరిధర్, అల్లాబకాష్ పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ కేంద్రాన్ని ప్రారంభించిన జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్

చిన్నమండెం, జనవరి 29(ప్రభాతవార్త):



ప్రకృతి వ్యవసాయాన్ని జగన్ ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సహిస్తోందని జెడ్పీ మాజీ వైస్‌ఛైర్మన్ దేవనాథరెడ్డి అన్నారు. చిన్నమండెంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ కేంద్రాన్ని దేవనాథరెడ్డి ప్రారంభించారు. ప్రకృతి వ్యవసాయం, రసాయన వ్యవసాయాల మధ్య తేడాలను దేవనాథరెడ్డి వివరించారు. ఈ కార్య క్రమంలో డీపీఎం రామకృష్ణరాజు, ఎంపీఎల్ చందురెడ్డి, ఎంపీటీసీ ఏజాస్ ఆలీ ఖాన్, సర్పంచ్ నజీర్‌అహ్మద్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పద్మావతి, శ్రీనివా సులు, సుబ్రమణ్యం, మోడల్ మేకర్స్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకృతి రెడీమేడ్ షోరూంలో అగ్నిప్రమాదం

ప్రొద్దుటూరు క్రైం, జనవరి 29, ప్రభాతవార్త



కొర్రపాడు రోడ్డులోని ఆకృతి రెడీమేడ్ షోరూంలో భారీ సోమ వారం అగ్ని ప్రమాదం జరిగింది. గడిచిన నాలుగైదు రోజుల నుంచి ఏసీలు సర్వీసింగ్ చేస్తుండడంతో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగి ఉంటుందని అగ్ని మాపక సిబ్బంది తెలిపారు. దట్టమైన పొగ కారణంగా మంటలను అదుపు చేస్తున్న ఫైర్‌మెన్ స్పృహ కోల్పోయిన సంఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంతో భారీగా ఆస్తి నష్టం సంభవించి నట్లు తెలిపారు.

## వెంకటనాగులును పరామర్శించిన రాముడు

చిన్నమండెం, జనవరి 29(ప్రభాతవార్త):



మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామం రోడ్డులోని గౌనిపల్లి వెంకట నాగులు బహిరంగసభ రోజు ప్రమాదవశాత్తూ కిందపడి అనారోగ్యంతో బాధపడు తున్నాడు. విషయం తెలుసుకుని రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వారి ఇంటి వద్దకు వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## దివ్యాంగులకు బస్సుపాసులు పంపిణీ

ప్రొద్దుటూరు క్రైం, జనవరి 29, ప్రభాతవార్త



అనిబిసెంట్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆర్ఎఫ్‌యూ దివ్యాం గుల మరియు వయోవృద్ధుల సొసైటీ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు పట్టణ పరిధిలో పేదరికంలో ఉండి బస్సు పాసులు తెచ్చుకోలేని దీన స్థితిలో ఉన్న దివ్యాంగులకు బస్సు పాసులు ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. దివ్యాంగుల సేవా సొసైటీ రాష్ట్ర కన్వీనర్ అఫ్జల్ మాట్లాడుతూ సోమవారం ఒక్కొక్క పాసుకు రూ.110 చొప్పున దాత అబ్దుల్ రషీద్ సహకారంతో 20 మందికి బస్సులు ఇవ్వడం జరిగింది. అన్ని రకాల బస్సుల్లో 50శాతం రాయితీతో ప్రయాణం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు చలపతిరావు, ఉపా ధ్యక్షులు ఖాజా మొహిద్దీన్, అబ్దుల్ రషీద్, యదార్థుడు, కొండమ్మ, లక్ష్మీ, సూరయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి రైతు ఈకేవైసి చేయించుకోవాలి : ఏఓ

ముద్దనూరు, జనవరి 29, ప్రభాతవార్త



ముద్దనూరు మండలంలో 23 రెవెన్యూ గ్రామాల్లో రబీలో సాగు చేసిన అన్ని పంటలను క్షేత్రస్థాయి సిబ్బంది పంట నమోదు చేసి ఈకేవైసి చేస్తున్నట్లు మండల వ్యవ సాయ అధికారి మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ రబీలో ఇప్పటి వరకు 1406మంది రైతులకు గాను 3289 ఎకరాల్లో పంట నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే 567 మంది రైతులకు గాను 1459 ఎకరాలకు సిబ్బంది ఈకేవైసి ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలిపారు. అలాగే ప్రతి రైతు ఇంకా ఎవరైన పంట నమోదు చేసుకోకుండా ఉండి ఉంటే అటువంటి రైతులు మీ సమీపంలోని ఆర్‌బీకే సిబ్బందిని సంప్రదించి పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. పంట నమోదు రైతుకు ధీమా వంటిదని తెలిపారు. పంట నమోదు కాకపోతే వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేసే పథ కం కూడ రైతులకు వర్తిం చదని తెలిపారు. రైతుకు పంటన నమోదు శ్రీరామరక్ష లాంటిదని తెలిపారు. పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు కూడ ఈకేవైసి పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఎవరైన దూరప్రాంతాల్లో ఉండి ఉంటే అలాంటి రైతులు తమ మొబైల్ నెంబర్ తెలిపి వచ్చిన ఓటీపీ ద్వారా ఈకేవైసి పూర్తి చేయించు కోవాలని తెలిపారు. పంట నమోదు ఈకేవైసి చేయించుకొనుటకు ప్రభుత్వం ఫిబ్రవరి 15వ తేది వరకు గడువు ఇచ్చిందని తెలిపారు. కావున ప్రతి ఒక్క రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## చెన్నారెడ్డిపల్లెలో ఉచిత పశువైద్య శిబిరం



ముద్దనూరు, జనవరి 29, ప్రభాతవార్త

మండలంలోని చెన్నారెడ్డిపల్లె గ్రామంలో వాటర్ షెడ్డు సహకారంతో డాక్టర్ వాసా శ్రీనివాస, ముద్దనూరు సంచాలకులు, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం నాడు ఉచిత పశువైద్య శిబిరమును ఏర్పాటుచేయడం జరిగింది. గ్రామములో పశు వైద్యము కోసము కొత్త పశువుల బోను(ట్రెవిన్)ను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ పశువైద్య శిబిరములో వ్యాధిబారిన పడ్డ ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, దూడలకు ఉచిత పశువైద్యము చేయడం జరిగింది. గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు త్రాపించడము జరిగినది, ఆకలి మందలించిన పశువులకు లివర్ టానిక్‌ను త్రాపించడము జరిగింది. సరైన సమయానికి యదకు రాని పశువులకు చికిత్సలు చేయడం జరిగింది. భాహ్య మరియు అంత:పారన్న జీవుల నిర్మూళనకు బుటాక్స్ స్ప్రే మరియు ఐవెర్మెక్టిన్ ట్యాబ్లెట్స్, ఇంజక్షన్ వాడడము జరిగింది. కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్‌రాజు, కొండావురము పశువైద్యాధికారి పాల్గొన్నారు. సూర్యబాబు, రామచంద్రారెడ్డి, పార్థసారధి, సిబ్బంది, వీరేంద్ర, నాగయ్యలు పాల్గొన్నారు.

## అనాధశ్రమంలో అన్నదానం

ప్రొద్దుటూరు అర్బన్, జనవరి 29, ప్రభాతవార్త



పద్మభూషన్ డా.మెగాస్టార్ చిరంజీవికి కేంద్ర ప్రభుత్వం పద్మ విభూషన్ అవార్డును ప్రకటించిన సంధర్భంగా ప్రొద్దుటూరు పద్మ భూషన్, పద్మవిభూషన్ మెగాస్టార్ పవర్‌స్టార్ ఫ్రెండ్స్ సేవాసమితి ఆధ్వర్యంలో వాత్సల్య అనాధ ఆశ్రమం నందు సోమవారం అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధి బుల్లితెర నటుడు దావూద్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పద్మభూషన్ పద్మవిభూషన్ మెగాస్టార్ చిరంజీవి ఇంకా ఎన్నో శిఖరాలు చేరుకోవాలని ఆయన స్ఫూర్తి తీసుకొని పలు సేవా కార్యక్రమాలు చేయడం అభిమానులుగా గర్వపడుతున్నామని, పట్టణ అధ్యక్షుడు రామారావు మాట్లాడుతూ 10 లక్షల పైన బ్లడ్ క్యాంప్స్, కొన్ని వేల నేత్రాలు సేకరణ, వేల మందికి కంటి చూపు తెప్పించిన మా ఆరాధ్య దైవం పద్మభూషన్ మెగాస్టార్ చిరంజీవికి భారత రత్న అవార్డు కూడ ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు మెగా అభిమానులు మణి, షరీఫ్(ట్రైర్లు), రామారావు, చంద్రధర్, చెన్నారంగ, బాషానెట్, మధు చిరురాయల్, రాము పాల్గొన్నారు.

## రూ. 31500లు దోచుకెళ్లిన శ్రీనివాసులు

### – న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకుల డిమాండ్

జమ్మలమడుగు, జనవరి 29, ప్రభాతవార్త



జమ్మలమడుగు పట్టణం పాత టీడీపీ కార్యాలయం ఎదురుగా ఉన్న దోసల అంగడిలో సుమారు మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో గూడూరు శ్రీనివాసులు గుర్తు తెలి యని కొంత మంది వ్యక్తులు దౌర్జ న్యంగా ప్రవేశించి ఇంటిలోని సామా న్లు పగలగొట్టి బీరువాలోని రూ.31500 నగదు తీసుకెళ్లిన వారిపై కేసు నమోదు చేయాలని రాజశేఖర్ పెద్దులయ్య డిమాండ్ చేశారు. నిరాశ్రులైన ముస్లిం మహిళ పట్ల గుర్తు తెలియని వ్యక్తులు దాడులు చేయడం దుర్మార్గ మన్నారు. శ్రీని వాసులు అతని అనుచరులపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని బాధి ^లు వేడుకుంటున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బాలస్వామి, సుధాకర్, ఓబన్న పాల్గొన్నారు.

## దస్తగిరమ్మకు న్యాయం చేయాలంటూ ధర్నా

ప్రొద్దుటూరు, జనవరి 29, ప్రభాతవార్త



ప్రొద్దుటూరు మండలం సోములవారిపల్లె గ్రామపంచాయతీ ఈశ్వర్‌రెడ్డి నగర్‌లో నివాసం ఉంటున్న వికలాంగురాలు మానికింద దస్తగిరమ్మ స్థలాన్ని కబ్జా దారుల నుండి రక్షించి ఆమెకు న్యాయం చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతిధిని సుధాకర్ మాదిగ అధికారులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం దస్తగిరమ్మకు న్యాయం చేయాలంటూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఏపి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతూ ధర్నా చేపట్టారు. ఈ సంధర్భంగా సుధాకర్ మాదిగ మాట్లాడుతూ శారీరక వైకల్యం కలిగిన దివ్యాం గురాలు దస్తగిరమ్మకు 2009లో అమృతానగర్‌లో ప్రభుత్వం 2 సెంట్ల స్థలం కలిగిన 1507 నెంబరు ప్లాటును మంజూరు చేశారన్నారు. అయితే స్థానిక సర్పం చ్ కొని రెడ్డి శివచంద్రారెడ్డి ఆ స్థలంలో ఆమె నివాసానికి అడ్డుపడుతూ మానసిక క్షోభకు గురిచేస్తున్నారన్నారు. అమృతనగర్‌లో ఉన్న ఖాళీ స్థలాలను తన అను వరులైన ఓబులేసు మరికొంత మందితో అక్రమణలు చేయిస్తూ ఎవరైన ఇళ్లు నిర్మించుకోవాలంటే 30నుండి 50వేల రూపాయల వరకు శివచంద్రారెడ్డి మామూళ్లు వసూలుచేస్తున్నారని ఆరోపించారు. తప్పుడు ఇంటి పట్టాలు సృష్టించి స్థలాలను, ఇళ్లను, అక్రమణలు చేయిస్తున్నారని ఆరోపించారు. హక్కుదారు లైన మానికింద దస్తగిరమ్మ తన స్థలంలో ఇంటిని నిర్మించుకోవడానికి అధికారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా అన్యా యాలకు, అక్రమాలకు, అక్రమణలకు పాల్పడి అవినీతి చేస్తున్న సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డిపై కలెక్టర్‌తో విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్‌చేశారు. అనంతరం స్థానిక తహసీల్దార్ నజీర్ ఆహమ్మద్‌కు దస్తగిరమ్మ కు న్యాయం చేసి అక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుచేస్తూ వినతిపత్రం అందించారు. ఈ కార్య క్రమంలో ఎస్సీ జనసంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వసుపులేటి శివకృష్ణ, అధ్యక్షులు పెద్దరాజు, గౌరవాధ్యక్షులు బత్తల సుబ్బరాయుడు, ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు రాజేశ్వరి, రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటమ్మ, మహిళా నేత ఇమాంబి, మాలమహానాడు మండల అధ్యక్షులు స్వామిదాసు, ఏపీ ఎమ్మార్పీఎస్ యువసేన రాష్ట్ర ఉపాధ్యక్షులు సాకే నారాయణస్వామి పాల్గొన్నారు.

## టిడిపి అభ్యర్థిని చంద్రబాబు మాత్రమే



ప్రొద్దుటూరు అర్బన్, జనవరి 29, ప్రభాతవార్త:

అధిష్టానం ప్రకటించక ముందు పే ప్రొద్దుటూరు టిడిపి ఇంచార్జ్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి టిడిపి అభ్యర్థి అని ఎలా చెబుతారని తెలుగుదేశం పార్టీ కడప పార్లమెంటరీ అధ్య క్షు డు, మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగా రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక కొర్రపాడు రోడ్డులోని అన్నా క్యాంటీన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు పట్టణం నుండి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే టికెట్ ఆశావహులు తనతో పాటు మాజీ ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి, టిడిపి రాష్ట్ర నాయకులు సురేష్‌నాయుడు, రాజుపాళెం మండల మాజీ ఎంపీపీ మెట్టు పల్లె ప్రభాకర్‌రెడ్డి, టిడిపి నాయకులు వీఎస్ ముక్తియార్, టిడిపి ఇంచార్జ్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి ఉన్నారని వారిలో ఎవరికి టికెట్ ఇవ్వాలనే విశ యంపై టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడుదే తురి నిర్ణయ మని వివ రించారు. ప్రొద్దుటూరు నియోజికవర్గంలో టిడిపి బలంగా ఉందని, కేవలం అభ్య ర్థుల మార్పు వలనే ఓటమిపాలవుతుందని, అన్ని వర్గాల మద్దతు టిడిపికే ఉంద న్నారు. కానీ ఇటివల టీడీపీలోచేరిన కమళాపురం మాజీ ఎమ్మెల్యే వీర శివారెడ్డి టిడిపి ఇంచార్జ్ ప్రవీణ్‌కే టికెట్ కేటాయించిందని, తాను మద్దతిచ్చి గెలిపిస్తానని మాట్లాడటం సమంజసం కాదన్నారు. ప్రొద్దుటూరు టిడిపి టికెట్ ప్రవీణ్‌కే అని తమకు ఎంటువంటి సందేశాలు రాలేదని, ఇందులో నిజం లేదని స్పష్టం చేశారు. వీరశివారెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. కొత్తగా పార్టీలో చేరిన వారు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలే కాని కార్యకర్తలను తప్పుదారి పట్టించడం సరికాద న్నారు. ఈ విశయంలో వారిపై పార్టీ అధిష్టానం చర్యలు తీసుకుంటుందని తెలి పారు. పార్టీ అధిష్టానం ప్రొద్దుటూరు అభ్యర్ధిని ప్రకటిస్తే అతని గెలుపుకు సమిష్టి గా కృషి చేస్తామని వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయ కులు విఎస్ ముక్తి యార్, మెట్టుపల్లె ప్రభాకర్‌రెడ్డి, నల్లబోతుల నాగరాజు, ఖలీల్‌బాష, గుర్రప్ప యాదవ్ పాల్గొన్నారు.

## మహిళా సాధికారతే లక్ష్యంగా జగన్ ప్రభుత్వం

### వైసిపి సమన్వయ కర్త శెట్టిపల్లె నాగిరెడ్డి



చాపాడు, జనవరి 29, ప్రభాతవార్త

మహిళలు ఆర్థికంగా నిల దొక్కుకునేందుకు మహిళా సాధికార తే లక్ష్యంగా జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పయనిస్తోందని మైదు కూరు నియోజికవర్గ వైసిపి సమ న్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి పేర్కొ న్నారు. సోమవారం మండల కేం ద్రంలోని వైఎస్ ఫంక్షన్‌హాల్ నందు డ్వాక్రా మహిళలకు ఆసరా మెగా చెక్కును అంద జేశారు. మండల వ్యాప్తంగా 762స్వయం సహాయక సంఘాలకు ఆసరలో భాగంగా 4వ విడతగా 5కోట్ల 35లక్షల 80వేల రూపాయలు మండలానికి వచ్చినట్లు అధికారులు తెలిపారు. అనంతరం నాగిరెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాల ద్వారా ఆర్థికంగా లబ్ది చేకూరుతుందని అన్నారు. మహిళల కోసం చేయూత, అమ్మఒడి, ఆసర వంటి మహత్తర కార్యక్రమాలు జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలోనే సాధ్యపడ్డాయన్నారు. 2014ఎన్నికల మేనిఫెస్టోలో చంద్రబాబు మహిళలకు మోసం చేశారన్నారు. వైకాపా ప్రభుత్వం మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలను 90శాతానికి పైగా అమలుచేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు టి.లక్ష్మయ్య, ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ లావణ్య, యూనియన్ బ్యాంక్ మేనే జర్ రాజశేఖర్ రెడ్డి, ఏపీఎం వెంకటరమణ, అన్నవరం రామ్మోహన్ రెడ్డి, వెలుగు సీసీలు, డ్వాక్రా సభ్యులు పాల్గొన్నారు.

## కోవిడ్ అమర వైద్య దినోత్సవం విజయవంతం చేయాలి

### – ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నాయకుల పిలుపు

కలికిరి, జనవరి 29, ప్రభాతవార్త

ఇండియన్ మెడికల్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా కోవిడ్ మహమ్మారి వ్యతిరేక పోరాట సేవలలో అశువులు బారిన వైద్యు లను స్మరించుకుంటూ ఈనెల 30న నిర్వహించనున్న కోవిడ్ అమర వైద్య దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డా.చం ద్రశేఖర్, సెక్రటరీ డా.వై.పవన్‌కుమార్, ట్రెజరర్ బి.ఈశ్వర్ సురేంద్రలు పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మశ్రీ అవార్డు గ్రహీత ఐఎంఏ పూర్వ జాతీయ ప్రధాన కార్యదర్శి అయిన డా.కేకే అగర్వాల్ ఏపీకి చెందిన జాతీ య ఉపాధ్యక్షులు డా.గంగాధర్‌రావు ఇంకా పలువురు ఈ మహమ్మారి వ్యతిరేక పోరాటంలో ప్రాణాలు కోల్పోవడం జరిగింది. ఏపీలో సుమారు 124 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిని కోవిడ్ అమరవైద్యులుగా గుర్తించి వారికి సముచిత స్థానం కల్పించి వారి స్ఫూర్తిని వారి త్యాగాలను స్మరించుకొనేందుకు వారి కుటుం బ సభ్యులతో సముచిత స్థానం పంచుకునేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్న ట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ నాయకులు, పలువురు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

## డ్రైవర్లకు కంటి పరీక్షలు

బద్వేలు, జనవరి29ప్రభాతవార్త



పట్టణంలోని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో సోమవారం డ్రైవర్లకు కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా డ్రైవర్లకు ఆప్తాల్మిక్ సిబ్బంది కంటి పరీక్షలు నిర్వ హించి వైద్యాధికారులు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంవీఐ శేఖర్‌రావు మాట్లాడుతూ ప్రతిడ్రైవర్‌కు కంటిచూపు ప్రధానమని ఈ విషయంపై జాగ్రత _లు తీసుకుని క్షేమంగా ఇంటికి చేరేలా ప్రతి డ్రైవర్ వాహనాలు నడపాలన్నారు. నిబంధనలు పాటిస్తూ డ్రైవర్లు వాహనాలు నడిపితే ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోవన్నారు. దూర ప్రాంతాలకు ప్రయాణం చేసే డ్రైవర్లకు కంటిచూపే ప్రధానమని అందుకోసమే కంటి వైద్యాధికారుల చేత ప్రతి డ్రైవరు పరీక్షలు చేసి అవసరమైన చికిత్సలు వారికి ఇవ్వడం జరిగిందన్నారు. ఈ మాసోత్సవాలలో ప్రతి రోజు మన పరిధిలో ఏదో ఒక ప్రాంతంలో వారికి సరైన సలహాలు, సూచనలు ఇవ్వడం వలన ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు. డ్రైవర్లు ఎప్పటికీ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని అవసరమైతే తెలుసుకునిముందుకు వెళితే ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. డ్రైవర్లపై అనేక కుటుంబాలు ఆధారపడి జీవిస్తాయని దీనికోసం డ్రైవర్లు అవసరమైతే శిక్షణ తీసుకుని డ్రైవర్లు ప్రయాణాన్ని గమ్యం చేరేలా చూడాలన్నారు. ముఖ్యంగా ఆటో డ్రైవర్లు ఎక్కువమంది ప్రయాణీకులను తీసుకెళ్లడం వలన ప్రమాదం జరిగే అవకాశం ఉందని , స్కూల్ వ్యాన్‌కు వెళ్లే డ్రైవర్లు కూడా నిబంధనలు పాటిస్తూ, వేగాన్ని నియంత్రించుకోవాలన్నారు. ఈ కంటి వైద్య పరీక్షలకు సుమారుగా 100 మంది డ్రైవర్లు పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు.

## సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్‌గా సుందరరామిరెడ్డి పదవి కాలం పొడిగింపు

బద్వేలు, జనవరి29 ప్రభాతవార్త



ఏపీస్టేట్ సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్‌గా సుందర రామిరెడ్డి పదవి కాలాన్ని పొడిగించారు. ఈ సందర్భగా సివిల్ సప్లై కార్పొరేషన్ ఎండీ విజయేంద్ర పాండ్య చేతుల మీదుగా పదవి కాలం పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన పత్రాన్ని సుందర రామిరెడ్డి అందుకున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సుందర రామిరెడ్డి మాట్లాడుతూ నా మీద నమ్మకంతో సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్‌గా పదవి కాలాన్నీ పొడగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయ మన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్సీ డిసి.గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విధి నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు చేయకుండా నిష్పక్షపాతంగా తమ బాధ్యతను నిర్వహించడం జరిగిందని సుందరరామిరెడ్డి పేర్కొన్నారు.

## యువత ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

### యంవిఐ వి.శేఖర్ రావు

మైదుకూరు జనవరి 29, ప్రభాత వార్త



35వ జాతీయ రహదారి భద్రత మహోత్సవాలల్లో భాగంగా యువశక్తి ద్వారా సామాజిక మార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిధులుగా మోగారు వెహికల్ ఇన్స్పెక్టరు వి.శేఖరు రావు పాల్గొన్నారు. అనంతరము ఆయన విధ్యార్థులకు ఉద్దేశించి మాట్లాడుతూ వాహనాలకు వేగంగా నడపడం ప్రమాదకరమని తెలిపారు. ట్రాఫిక్ నిబందనలను పాటిస్తూ వాహనాలు నడిపితే ప్రమాదాలు జరగవని తెలిపారు. వాహనాలలో ఇతర ప్రాంతా లకు వెళ్లేటప్పుడు రహదారి ప్రక్కన ఏర్పాటు చేసిన సూచికలను గమనించాలని, ప్రతి ఒక్కరు తప్పని సరిగా డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, హెల్మేంటు దరించాలని తెలిపారు. వాహనాలల్లో వేళ్లే టప్పుడు సీటు బెల్టు తప్పని సరిగా ధరించాలని తెలిపారు. కార్యక్రమంలో మేధా కాలేజ్, బ్లూ బెల్స్ కాలేజ్ ప్రిన్సి పాల్ విద్యార్థులు పాల్గొన్నారు.

## 45మద్యం సీసాలు స్వాధీనం, ఒకరిపై కేసు నమోదు

చాపాడు, జనవరి 29, ప్రభాతవార్త



మండలంలోని అన్నవరం గ్రామానికి చెందిన పిచ్చోళ్ల సుబ్బరాయుడు అనే వ్యక్తిని అక్రమ మద్యం తరలిస్తుండగా చాపాడు పోలీసులు కేసు నమోదు చేసి నట్లు ఎస్ఐ ఆర్వీ కొండారెడ్డి తెలిపారు. పోలీసుల ముందస్తు సమాచారం మేరకు ఎటువంటి అక్రమ మద్యం విక్రయానికి అనుమతి లేకుండా 45సీసాలు పట్టుబడ్డ అతనిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

## బాబు ష్యూరిటి భవిశ్యత్తుకు గ్యారెంటీలో మౌనికా రెడ్డి

ప్రొద్దుటూరు, జనవరి 29, ప్రభాతవార్త



ప్రొద్దుటూరు పురపాలక సంఘం పరిధిలోని శ్రీనివాస్‌నగర్‌లో సోమవారం నిర్వహించిన బాబు ష్యూరిటి భవిశ్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ప్రొద్దుటూరు టీడీపీ ఇంచార్జ్ జీవి ప్రవీణ్‌కుమార్ రెడ్డి సతీమణి మౌనికారెడ్డి, సోదరి హరితా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ ప్రకటించిన మిని మేనిఫెస్టోలోని సంక్షేమ పథకాలను ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరిస్తూ కర పత్రాలు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో మస్తాన్ గోలె, కోగటం నాయబ్, కరీముల్లా, గఫార్, నూర్, తాటి శ్రీనివాసులుయాదవ్, ఆవుల దస్త గిరయ్య, పట్నం మాబాష, గగ్గుటూరు గౌస్‌మొహిద్దీన్, పుల్లారెడ్డి, నర సింహారెడ్డి, కమాల్ బాష, ద్వారకానగర్ కిట్టు, సుధాకర్‌యాదవ్, మార్తల ప్రతాప్‌రెడ్డి, హోటల్ మధు, టిడిపి నాయకులు, కార్యకర్తలు నందమూరి అభిమానులు పాల్గొన్నారు.

## శివానందలహరి రెడ్డికి సన్మానము



బద్వేలు రూరల్, జనవరి29 ప్రభాతవార్త:

జాతీయ స్థాయిలో పేరొందిన కళారత్న గొల్లపల్లి జయన్న తమ తల్లి దండ్రుల జ్ఞాపకారం ప్రతిభా వంతులైన ఏపీ, తెలంగాణా రాష్ట్రా లలోని కళాకారులను గుర్తించి సన్మానించడం ఆనవాయితీగా వస్తోందని ఇందులో భాగంగా బద్వే లు వాస్తవ్యుడైన డాక్టర్ శివానందలహరి రెడ్డికి సైన్స్ అండ్ టెక్నాలజీ రంగానికి సంబంధించి సన్మానించడం జరిగింది. 19 వార్షిక పురస్కార సభలో ముఖ్య అతిథి త్రిపురనేని హనుమాన్ చౌదరి చేతులమీదుగా జ్ఞాపికను అందజేయడం జరిగింది.

## రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డిని కలసిన నిస్సార్‌అహ్మద్

మదనపల్లె, జనవరి 29 ప్రభాతవార్త :



రాయలసీమ వైఎస్‌ఆర్ సిపి రీజనల్ సమావేశం తిరుపతిలో సోమ వారం నిర్వహించారు. ఈసమావేశంలోమదనపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్ రాష్ట్రమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగాకలుసుకొన్నారు. తిరుపతిలోఉమ్మడిచిత్తూరు,కడప, అనంతపురం, కర్నూల్ జిల్లాల వైఎస్‌ఆర్ సిపి ఎంపి, ఎమ్మెల్యే,ఎమ్మెల్సీల నియోజకవరాలఇన్‌చార్జ్‌లతోమంత్రిఅధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలనో ప్రజలకు అందిన పథకాలు, సంక్షేమ కార్యక్రమాల గురించి ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులు తెలియజేయాలని మంత్రి సూచించారు. ప్రతి గ్రామానికి వెళ్లి ప్రజలతో మమేకం కావాలని మంత్రి తెలిపారు. ప్రభుత్వ చేపట్టిఅమలు పరచి అర్థికసాయం గురించి తెలియజేయాలని సూచించారు. ఈ సమావేశానికి హాజరైన నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్ మంత్రి తెలిపిన సూచనలు, సలహాలను తెలుసుకొన్నారు. అనంతరం ఎంపి గురుమూర్తి, ఎమ్మెల్యేలు కేతిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, హాఫీజ్‌ఖాన్‌లతో ప్రత్యేకంగా చర్యలు జరిపారు.

## వాహన డ్రైవర్లకు కంటిచూపు చాలా ముఖ్యం

ఎంవిఐ శివలింగయ్య

మదనపల్లె, జనవరి 29 ప్రభాతవార్త :



వాహన డ్రైవర్లకు కంటిచూపు చాలా ముఖ్యమని మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ శివలింగయ్య తెలిపారు. రోడ్డు భద్రతా నిబంధనల ప్రతి ఒక్కరూ పాటించాలని ఆటో, బస్సు, లారీ క్యాబ్ డ్రైవర్‌లను ఆయన కోరారు. 35వ జాతీయ రహదారి భద్రతామాసోత్సవాల సందర్భంగా ఎంవిఐ శివలింగయ్య సమక్షంలోఆర్టీఓ కార్యాలయంనందు డ్రైవర్లకు ఎల్‌వి.ప్రసాద్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైశిబిరం నిర్వహించారు. గత కొన్నేళ్ళుగా జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు జరుపుకొంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనంలో ఇద్దరికి మించి వెళ్ళరాదని, ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని వాహనాలు నెమ్మదిగా నడపాలని కోరారు. ప్రమాదం వల్ల కుటుంబంలో ఒకరు దూరమైన కుటుంబమంతా రోడ్డున పడేఅవకాశం ఉందన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని సూచించారుర. కారుల్లో తప్పనిసరిగా సీటుబెల్టు పెట్టుకోవాలని సూచించారు. అనంతరం డ్రైవర్లచే ఎంవిఐ శివలింగయ్య ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఓ కార్యాలయ సిబ్బంది, లారీ, ఆటో, క్యాబ్ డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

## బహుజనసేన చేపట్టిన నిరసనదీక్ష విజయవంతం

నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపచేసిన నాయకులు

మదనపల్లె, జనవరి 29 ప్రభాతవార్త :



అనాథపిల్లలకు చెందిన స్థలాన్ని కొందరూ భూ కబ్జాకు పాల్పడ్డారని, స్థలాన్ని కబ్జానుంచి కాపాడేందుకు సబ్‌కలెక్టరేట్ కార్యాలయం వద్ద అనాథ ఆశ్రమం పిల్లలతో కలసి బహుజన సేన ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షను సోమవారం వైసిపి ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్ నిమ్మరసం ఇచ్చి విరమింపచేశారు. ఈ నెల 26నుండి చేపట్టిన దీక్ష ఫలితంగా నేడు ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్‌తో పాటు మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ జింకాచలపతి, తహశీల్దార్‌లు శిబిరానికి చేరుకొని సమస్య పరిష్కారం చేశారు. అనాథ పిల్లలకు స్థలంలో పాటు భవన నిర్మాణానికి కూడా తన వంతు కృషి చేసి సాయం చేస్తానని నిస్సార్‌అహ్మద్ తెలిపారు. దీంతో దీక్ష విరమింప చేశారు. బహుజన సేన ఆధ్వర్యంలో అనాథ పిల్లల పోరాటానికి సంఘీభావం తెలిపిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కొండుపల్లి ఆనంద్, ఆటో యూనియన్ నాయకులు రాఘవేంద్ర యాదవ్, జిల్లా సెక్రటరీ రూపక్‌నాయక్, చంద్రశేఖర్, వెంకీ, గంగాధరన్, వంశీ, శ్రీకాంత్, లవ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు ఆసుపత్రుల దోపిడిపై జేసికి ఫిర్యాదు

మదనపల్లె, జనవరి 29 ప్రభాతవార్త :



మదనపల్లెలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో జరుగుతన్న అన్యాయాలు, దోపిడిలపై సోమవారం బహుజన యువసేన అధ్యక్షులు పునిత్ సోమవారం జాయింట్ కలెక్టర్, డిఎంఅండ్‌హెచ్‌ఓ ఫిర్యాదుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఆసుపత్రుల్లో వైద్యులు వైద్యంపేరుతో రోగులను దోపిడి చేస్తున్నారన్నారు. పేదల భయాన్ని సొమ్ము చేసుకొంటూ వైద్యాన్ని వ్యాపారంలా మార్చివేశారన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లల ఆసుపత్రుల్లో మరింత దారుణాలు జరుగుతున్నాయన్నారు. చిన్నపాటి జబ్బు వచ్చినా ఐసియూ పేరుతో నిలువుదోపిడి చేస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్ చేసినా డబ్బులు గుంజుతున్నారన్నారు. ఆసుపత్రుల దోపిడిలపై జిల్లా అధికారులు విచారణ జరిపి ప్రజలకు న్యాయం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు విద్యాసాగర్, శ్రీనాథ్, పూర్ణ, సందీఫ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధారాలతో కూడిన సమస్యలను విన్నవించండి

స్పందనాలో ఆర్డీఓ ఎంఎస్ మురళి

మదనపల్లె, జనవరి 29 ప్రభాతవార్త :



ప్రజలు స్పందనాలో సమస్యలు విన్నవించేటప్పుడు ఆధారాలతో కూడిన సమస్యలను విన్నవించాలని ఆర్డీఓ ఎంఎస్.మురళి తెలిపారు. సోమవారం సబ్‌కలెక్టరేట్‌కార్యాలయంలో జరిగిన స్పందనాలో ఆర్డీఓ ప్రజల నుంచి వివిధ సమస్యలను అర్జీలరూపంలో స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా భూ సమస్యలకు సంబంధించి ఆధారాలతో కూడిన సమస్యలను విన్నవించాలన్నారు. సమస్యను బట్టి ఆయా శాఖల అధికారులతో పరిష్కరించడం జరుగుతుందన్నారు. డివిజన్‌లో ఎక్కువుగా భూ సమస్యలపైనే ప్రజలు విన్నవించుకోవడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా రోడ్లు, పట్టాదారుపాసుపుస్తకాలు, ప్రభుత్వ పథకాల గురించి సమస్యలు విన్నవిస్తున్నారన్నారు. ప్రజలు విన్నవించే ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## ఉమ్మడి ఆస్థి న్యాయం చేయండి

కురబలకోట, జనవరి 29 ప్రభాతవార్త:



ఉమ్మడిగా ఉన్న ఆస్థిని కుటుంబంలో ఒకరికే మంజూరు చేయవద్దని మండలంలోని సిగిరే వాండ్లపల్లెకు చెందిన రైతులు లక్ష్మిదేవి, శ్రీలక్ష్మి, రెడ్డమ్మలు సోమవారం తహశీల్దార్ భీమేశ్వర్‌రావుకు గ్రీవెన్స్‌డేలో విన్నవించారు. తమ తల్లి సుబ్బమ్మ పేరిట ఖాతా నెంబర్ 493, 165తో పట్టాదారు పాసుపుస్తకం ఉందన్నారు. ఈమె చనిపోవడంతో మా సోదరడు సుబ్బాచారి మాకు తెలియకుండా ఆస్థిని కాజేయాలని పాసుబుక్కుల కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. మా తల్లికి ఆరుమంది సంతానం ఉండగా ఒక్కరే ఆభూమిని అంతటిని కాజేయాలని ప్రయత్నిస్తున్నట్లు వారు తెలిపారు. సదరు ఆస్తితో పాటు ఇంటిస్థలాలు ఎవరిపేరిట మంజూరు చేయరాదని తమకు న్యాయం చేయాలని తహశీల్దార్‌కు సమర్పించిన వినతిపత్రంలో పేర్కొన్నారు

## ప్రలోభాలతో కార్యకర్తలను కాపాడుకునే స్థాయికి దిగజారిన వైకాపా

– టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీటెక్ రవి

పులివెందుల, జనవరి 29, ప్రభాతవార్త



వైకాపా అధికారం చేపట్టి నాలుగు సంవత్సరాలుగా కార్యకర్తలను పట్టించు కోలేదని, అటువంటిది వైకాపా పెద్దలు నేడు రూ.10వేల నుండి రూ.20లక్షల పైన డబ్బులు పంచి కాపాడుకునే స్థాయికి దిగజారడం చూస్తే వారికి ఓటమి భయం కలుగుతోందన్న విషయం అర్థం అవుతోందని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి బీటెక్ రవి అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లా డారు. 1978 నుండి పులివెందుల నియోజకవర్గంలో రాజకీయ పదవులు అనుభ విస్తూ రెండుసార్లు ముఖ్యమంత్రి అయి ఉండి సర్వేలన్నీ వైకాపాకు ప్రతికూలంగా వస్తుండడంతో ప్రజాదర్బార్ అనే పేరుతో ప్రతి గ్రామం నుండి కార్యకర్తల్ని పిలిపించుకుని ఇష్టం వచ్చినట్లు డబ్బులు పంచే స్థాయికి వైకాపా దిగజారిం దన్నారు. ఒక్కొక్కరికి ఒక విధంగా డబ్బులు ఇస్తుండడంతో వారు మీరు ఇవ్వండి టీడీపీలో చేరతామని అడుగుతున్నారని ఆయన తెలిపారు. వాళ్లంటే అక్రమంగా సంపాదించింది కాబట్టి ఇష్టం వచ్చినట్లు పంచుతున్నారని, మేము బత్తాయిలు అమ్మి రాజకీయం చేస్తున్నామని, మేము ఇవ్వలేమని చెప్పామని బీటెక్ రవి అన్నారు. కార్యకర్తల్ని కాపాడుకునేందుకు పంచాయతీల వారిగా ఒక్కొక్కరిని పిలిపించుకుని రూ.పది నుంచి రూ.20లక్షల రూపాయలు గ్రావెల్‌రోడ్డు పనులను ఇచ్చి ప్రభుత్వ ధనాన్ని వైకాపా కార్యకర్తలకు పాడా అనే పథకం ద్వారా పంపిణీ చేస్తూ ధనం అంతా వ్యర్థం చేస్తున్నారన్నారు. వైఎస్ షర్మిల వైకాపాలోను, తెలంగాణలోను ఉన్నంత వరకు ఎటువంటి విమర్శలు చేయని వైకాపా అభిమానులు ఇప్పుడు వైఎస్ షర్మిల కాంగ్రెస్‌లో చేరిందని ఆమె రెడ్డి కాదు.. శాస్త్రిలంటూ ఇష్టం వచ్చినట్లు అసభ్యకర పోస్టింగులు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొరియర్ ప్రసాద్‌రెడ్డి, దస్తగిరిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కులంపేరుతో మూకుమ్మడి దాడి

మదనపల్లెక్రైం, జనవరి 29 ప్రభాతవార్త :

భూవివాద ఘర్షనలో భాగంగా కొందరు వ్యక్తులు ఓ వ్యక్తిని కులం పేరుతో దూషించి మూకుమ్మడిగా దాడి చేశారు. బాధితుడు కథనం మేరకు మదనపల్లె మండలం బికేపల్లి పంచాయితీ వైఎస్‌ఆర్ కాలనీకి చెందిన బుక్కే మంగేనాయక్ రియల్ వ్యాపారి ఈ నేపథ్యంలో కొద్దిరోజుల క్రితం మండలంలోని కొత్తవారి పల్లెకు చెందిన ఒంటిమిట్ట సిద్దయ్య టేకుమాని మునిస్వామి వారసుల నుంచి 3.16 ఎకరాల భూమిని కొనుగోలుచేసి అగ్రిమెంటు చేసుకొన్నారు. అయితే సోమవారం జేసిబితో పొలాన్ని చదును చేస్తుండగా మునుస్వామి వారసులు అడ్డుకొన్నారు. దీంనతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో అవేశానికి గురైన వెంకటరమణ, రెడ్డప్ప, అరుణ, రమాదేవి, శ్రీదేవి, పుణ్యవతిలు కులంపేరుతో దూషించి మూకుమ్మడిగా దాడి చేశారని మంగేనాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. అయితే పక్కా ఆధారాలతో పొలాన్ని కొనుగోలు చేసి అగ్రిమెంటు చేసుకొన్న తనను ఆ భూమిలోకి రానీయకుండా దౌర్జన్యం ప్రదర్శిస్తున్నారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు విచారిసున్నట్లు తాలూకా పోలీసులు చెప్పారు.

## ఆప్లికేషన్ సమీక్ష పోటీల్లో ప్రతిభ

కురబలకోట, జనవరి 29 ప్రభాతవార్త:



అప్లికేషన్ సమీక్ష పోటీల్లో జీవిఐసి విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. అమెరికాలోని చికాగో కేంద్రంగా స్థాపించిన ప్రముఖ సోషల్ మీడియా కంపెనీ యూనిట్ ఐఎన్‌సిలతో గోల్డన్‌వ్యాలీ ఇంజ నీరింగ్ కళాశాల ఎంఒయు కుదుర్చు కొంది. ఈ కంపెనీ ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం అప్లికేషన్ సమీక్ష పోటీలు నిర్వహించింది. ఈ పోటీల్లో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ.10వేలు, ద్వితీయబహుమతి రూ.5వేలును కళాశాల కరస్పాండెంట్ ఎన్‌వి.రమణారెడ్డి అందజేశారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో సిఈఓ, ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## గర్భిణుల సంరక్షణ కుటుంబ సభ్యులదే బాధ్యత

పీలేరు,జనవరి 29 ప్రభాతవార్త



గర్భిణీస్త్రీలకు చేసే శారీరక పరీక్షలే పుట్టబోయే శిశువు యొక్క మేలైన ఆరోగ్యానికి పునాది అని డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్ తల్లులకు తెలిపారు. సోమవారం స్థానిక మోడల్ కాలనీలో హైరిస్కు గర్భిణ స్త్రీలకు ఆరోగ్యపరీక్షలు వారి ఆరోగ్య సిబ్బందితో కలిసి నిర్వహించారు. తల్లి గర్భంతో ఉన్నప్పుడు తొమ్మిది మాసాలలో తల్లి పూర్తి ప్రభావం బిడ్డపై ఉంటుందని మందులు తినడమే కాకుండా కోపం లాంటి పరిస్థితులకు దూరంగా ఉండాలి, మానసికప్రశాంతత అలవర్చుకోవాలి, మంచి పౌష్టికాహారం తీసుకోవాలి,8 గంటలు నిద్ర, పగటిపూట రెండుగంటల విశ్రాంతి ఉదయం పూట తేలికపాటి నడక, నిర్దేశించిన సమయా నికి ఆరోగ్య పరీక్షలుతో తల్లి బిడ్డ సంక్షేమానికి ఎంతో దోహదం చేస్తుందని గర్భిణీస్త్రీలకు తెలియజేసి ఐరన్ పోలిక్, ఆల్‌బెండోజెల్ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, ఏఎన్‌ఎం లక్ష్మి, సీహెచ్‌ఓ సౌజన్య, వెంకటరత్నం ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పవన్‌కళ్యాణ్‌ను కలిసిన మోకాటి సుబ్బయ్య

పీలేరు, జనవరి 29 ప్రభాతవార్త



జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కళ్యాణ్‌ని అన్నమయ్య జిల్లా కాపు సంక్షేమ సేన ప్రధాన కార్యదర్శి మోకాటి సుబ్బయ్యను సోమవారం కలిశారు. ఈసంద ర్భంగా జిల్లాలోని పలు అంశాలపై చర్చించారు. రానున్న రోజుల్లో పార్టీని బలోపేతం చేయడానికి మరింత కషిచేయాలని సూచించారు. రాయసీమ జిల్లాలో బలమైన నాయకులు జనసేన పార్టీకి అండగా నిలవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. అక్కడి జనసేన కార్యకర్తలకి సరైన నాయకత్వం లేక బలం పుంజుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాపు సంక్షేమ సేన తరుఫన జనసేన పార్టీకి అన్నివేళలా బలంగా నిలబెడతామని నేను తెలియజేయడం జరిగింది. జిల్లాలోని పీలేరు నియోజకవర్గం జనసేన నాయకులు సమన్వయ లోపంతో సరిగా ముందుకు సాగటం లేదని ఆయన దష్టికివచ్చినట్లు తెలియజేశారు. దానిపై మరింత లోతుగా చర్చించడం జరిగింది. వారితో చర్చించి సమన్వయపరచి ముందుకు తీసుకెళ్లమని సూచించడం జరిగింది.

## షమీర్‌బాషాను శాల్వతో సత్కరించిన మహిళలు

కడప వైద్యవిభాగం, జనవరి 29, ప్రభాతవార్త:



నంద్యాల నుంచి కడప వరకు వెళ్లి డెమో రైలును రేణిగుంట్ల వరకు పొడిగించినందుకు కడప ఎంపీ అవినాష్‌రెడ్డిని డివిజనల్ రైల్వే సభ్యుడు షామీర్ బాషాకు కడప జిల్లా మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. పేదలకు, ముసలి వారికి దివ్యాంగులకు ఎంతగానో తోడ్పడుతోందన్నారు. రైల్వే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తామని డివిజనల్ రైల్వే సభ్యుడు షమీర్ బాషా తెలిపారు.

## ఉరుసు ఉత్సవంలో నల్లారి దంపతులు

పీలేరు, జనవరి 29 ప్రభాతవార్త



కలికిరి మండలం మహల్ పంచాయతీలో హజ్రత్ ఖ్వాజా సయ్యద్ యూసూఫ్ అలీ బాద్షా దర్గాలో 175 ఉరుసు ముబారక్ ఉత్సవంలో తెదేపా జాతీయనేత నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి వారి సతీమణి నల్లారి తనూజారెడ్డి దంపతులు పాల్గొన్నారు. మహల్ నందు ఘనంగా జరిగిన ఉరుసు ముబారక్ ఉత్సవానికి ముఖ్యఅతిగా పాల్గొన్న మైసూరు గురువు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆ అల్లాహ్ కిశోర్‌కుమార్‌రెడ్డి కుటుంబాన్ని చల్లగా చూడాలని, వచ్చే ఎన్నికల్లో అఖండ మెజారిటీతో గెలవాలని దువాహ్ చేశారు. శనివారం గంధం ఊరేగింపు, ఆదివారం ఉరుసు ఉత్సవంతో పాటు గొప్ప గొప్ప ఖవాలిలతో జరిగినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈకార్యక్రమంలో రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి బాబురెడ్డి, రాజంపేట ఉపాధ్యక్షులు వాసునూరి చంద్రశేఖర్, మండల అధ్యక్షులు నిజాముద్దీన్, సతీష్‌రెడ్డి, మున్వర్ తదితదరులు పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరించిన డాక్టర్ చంద్రశేఖర్

పీలేరు, జనవరి 29 ప్రభాతవార్త



2024 సంవత్సరపు ఏపీ పబ్లిక్ హెల్త్ మరియు మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఉమ్మడి జిల్లా క్యాలెండర్‌ను పీలేరు ప్రాంతీయ వైద్యఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ వారి చాంబర్ నందు సోమవారం ఆవిష్క రించారు. ఈసందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ యూనియన్ల బలోపేతా నికి వీటి ద్వారా కార్యసాధనకు ఉద్యోగులు సహకరించుకునే ఆవశ్యకతను డాక్టర్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ రాష్ట్ర ఉపా ధ్యక్షులు లక్ష్మీనారాయణ జిల్లా జాయింట్ సెక్రటరీ కుసుమకుమారి, శ్యామల, కొండయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## బస్టాండు సీలింగ్, స్లాబ్, పిల్లర్ల మరమ్మతులకు రూ.8.54లక్షలు మంజూరు

పీలేరు, జనవరి 29 ప్రభాతవార్త



స్థానిక ఆర్టీసీ బస్టాండు 1978లో నిర్మించారు. బస్టాండులో సీలింగ్ పెచ్చులూడి ప్రయాణికులపై పడుతుందన్న భయంతో స్థానిక డిపో మేనేజరు పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం తో స్పందించిన ఉన్నతాధికారులు సివిల్ ఇంజినీర్ ద్వారా ఎస్టిమేట్ వేయించి రూ.8.54లక్షలు మంజూరు చేయించారు. సీలింగ్, స్లాబు, పిల్లర్ల మరమ్మతుల పనులు ప్రారం భించారు. దీంతో బస్టాండులో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా అలాగే దుకాణాలలో నీరు కారకుండా మరమ్మతులు చేయిస్తున్నట్లు డీఎం తెలిపారు. అలాగే బస్టాండులో మౌళిక వసతులు నీరు, గాలి వచ్చేందుకు ఫ్యాన్లు, పరిశుద్ధ జలయంత్రాలను మరమ్మతులు చేయిస్తామన్నారు. దీంతో ప్రయాణికుల ఇబ్బందులు తొలుగుతాయన్నారు.

## కడప బీజేపీ పార్లమెంటు కన్వీనర్‌గా బొమ్మన సుబ్బరాయుడు

కడప కార్పొరేషన్, జనవరి 29, ప్రభాతవార్త



సాధారణ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా పార్లమెంటు నియోజకవర్గ కన్వీనర్లను ప్రకటించారు. అందులో భాగంగా బీజేపీ కడప పార్లమెంటు నియోజకవర్గ కన్వీనర్‌గా బొమ్మన సుబ్బరాయుడు పేరును ప్రకటించారు. ఈ సందర్భంగా బొమ్మన సుబ్బరాయుడు మాట్లాడుతూ తనని పార్లమెంటు కన్వీనర్‌గా నమ్మకం ఉంచి పదవి బాధ్యతలు అప్పగించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి, బీజేపీ జాతీయ కార్యదర్శి చైతన్యకుమార్, రాష్ట్ర కార్యదర్శి మధుకర్, రాజ్యసభ సభ్యులు సీఎం రమేష్‌నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆదినారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షులు వంగళ శశిభూషణ్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ కోసం మరింత కష్టపడి పని చేస్తానన్నారు.

## దేవతల విగ్రహాలను తొలగించడం దారుణం

కడప కార్పొరేషన్, జనవరి 29, ప్రభాతవార్త



కడప ఎమ్మార్వో కార్యాలయం వెనక ఉన్న దేవి దేవతల విగ్రహాలు, రేకుల షెడ్డు తొలగించడం దారుణమని బీజేపీ కడప కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జంగిటి వెంకట సుబ్బారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు బొమ్మన విజయ్, నాయకులు పవన్‌కుమార్‌లు అన్నారు. సోమవారం కడప తాహసీల్దారఉ కార్యాలయం ఆవరణలో ఉన్న దేవాలయాన్ని బీజేపీ నాయకులు హిందూ సంఘాలు పరిశీలించారు. తిరిగి ఆ విగ్రహాలను యథావిధిగా ఉంచాలని డిమాండ్ చేశారు. నేడు జరగబోయే ధర్నా కార్యక్రమంలో అన్ని హిందూ సంఘాలు పాల్గొంటారని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అర్చక సంఘం జిల్లా అధ్యక్షులు విజయ్ బట్టర్, సీనియర్ న్యాయవాది భారవి, బీజేపీ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, లక్ష్మణరావు, రంగప్రసాద్, ప్రభు, నాగిరెడ్డి, హిందూ సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

## అనంతపురం బీజేపీ ఇన్‌ఛార్జిగా లక్ష్మీనారాయణ

కడప కార్పొరేషన్, జనవరి 29, ప్రభాతవార్త



బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.వి.లక్ష్మీనారాయణరెడ్డిని అనంతపురం జిల్లా భారతీయ జనతా పార్టీ ఇన్‌ఛార్జిగా రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి నియ మించడం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణరెడ్డి మాట్లాడుతూ నన్ను గుర్తించి నాకు బాధ్యత ఇచ్చిన రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి, సంఘటనా మంత్రి మధుకర్, జిల్లా అధ్యక్షులు వంగల శశిభూషణ్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్రా శివనారాయణ, మాజీ మంత్రి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆదినారా యణరెడ్డి, రాజ్యసభ సభ్యులు సీఎం రమేష్ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ యాదవ్, కడప జిల్లా ఇన్‌ఛార్జి దుద్దికుంట వెంకటేశ్వరరెడ్డికు కృతజ్ఞతలు తెలిపారు. నాపై నమ్మకంతో రాష్ట్ర పార్టీ అప్పజెప్పిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

## శుభ్రత పరిశుభ్రతపై అవగాహన

వీరబల్లి, జనవరి 29, ప్రభాత వార్త



ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా ఐదవ రోజు సోమవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 ప్రోగ్రామ్ ఆఫీసర్ జి. రఘురామయ్య ఆధ్వర్యంలో వాలంటీర్లు కలిసి దత్తత గ్రామమైన మంగళపల్లి నందు ఇంటింటా అధికారిక విద్య, సాధారణ, ఉపాధి లేని యువత అనే అంశంపైన సర్వే నిర్వహించి విషయాలను సేకరించడం జరిగింది. ఆరుబయట మలమూత్ర విసర్జన వంటి అంశాలపై అవగాహన కల్పించడం జరిగింది. కార్యక్రమంలో అధ్యాపకులు భాస్కర్, రామనారాయణరెడ్డి పాల్గొన్నారు.

## మోడీకి అవకాశం ఇస్తే మరో శ్రీలంకలా భారతదేశం

– సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకటరాములు

వేంపల్లె, జనవరి 29, ప్రభాతవార్త



మోదీకి మరోసారి అవకాశం ఇస్తే మరో శ్రీలంకలా భారతదేశం మారు తుందని సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకటరాములు అన్నారు. పులివెందులలోని ఎస్టీయూ కార్యాలయంలో సీపీఐ పులివెందుల పార్టీ ముఖ్య నాయకులతో జరిగిన సమావేశం అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అధికారమే పరమావధిగా పనిచేస్తూ ప్రజల ఆస్తులు అడ్డగోలుగా అమ్ముతూ దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసిన బీజేపీకి మరోసారి అవకాశం ఇస్తే దేశం పరిస్థితి మరో శ్రీలంక, పాకిస్థాన్‌ల మాదిరిగా తయారవుతుందని ఆయన తెలిపారు. వీటన్నింటి నుండి ప్రజల ఆలోచన మరల్చడానికి బీజేపీ మతాన్ని, పాకి స్థాన్ లాంటి అంశాలను తెరపైకి తెస్తుందన్న విషయాలను ప్రజలందరు గమనించి ఎన్టీఏ కూటమిని గద్దె దింపాలని పిలుపునిచ్చారు. దేశంలో ఇప్పటికే ఆర్థిక వ్యవస్థ పరిస్థితి దిగజారి ఎమర్జెన్సీ పరిస్థితుల్లో ఉందని, దేశాభివృద్ధిని మోదీ సర్కార్ 70సంవత్సరాలు వెనక్కి తీసుకువెళ్లిందని, దేశ చరిత్రలో ఎన్నడూలేని విధంగా నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాపోయాయని, ముడిచమురు ధరలు దారుణంగా పడిపోయినప్పటికీ దేశంలో పెట్రోలు, డీజిల్, గ్యాస్ రేట్లు రోజురోజుకు పెరిగిపోతున్నాయన్నారు. దేశంలోని ప్రజల ఆస్తులైన బీఎస్ఎన్ఎల్, ఎల్ఐసి, రైల్వేస్టేషన్లు, పోర్టులు, విమానాశ్రయాలు ఇలా చాలా వాటిని అదానికి అప్పనంగా కట్టబెట్టి అతి తక్కువ కాలంలో ప్రపంచ కుబేరుడిగా ఎదగడంలో అదాని అభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం తోడ్పడిందని, కాబట్టి ప్రజలంతా ఇప్పటికైనా మేల్కొని రానున్న ఎన్నికల్లో బీజేపీ కుట్రలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏరియా సహాయ కార్యదర్శులు బాష, కొత్త కాలువ బ్రహ్మం, వేంపల్లె నాయకులు జకరయ్య, అంజనప్ప, వెంకటరమణ పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీలో 30 కుటుంబాలు చేరిక

ఖాజీపేట,జనవరి 29,ప్రభాతవార్త



మైదుకూరు నియోజకవర్గం ఖాజీపేట మండలం కూనవారి పల్లె గ్రామానికి చెందిన రెడ్డెరి సుబ్బిరెడ్డి, తుపాకుల రఘురామిరెడ్డి ఉప సర్పంచ్, సురేంద్రరెడ్డి, రెడ్డెరి చంద్రహాసన్ రెడ్డి,గుమ్మా ప్రతాప్ రెడ్డి,జడ శివకుమార్ రెడ్డి,తుపాకుల లక్షి ్మరెడ్డి,ములపాక సాంబసివారెడ్డి,నాగేశ్వరరెడ్డి,పాలూరు శివారెడ్డి,కొండు వెంకట రెడ్డి,శ్రీనివాసుల రెడ్డి,బి.గురివిరెడ్డి వీరి తో పాటు తదితర వారి అనుచర వర్గం సుమారూ 30 కుటుంబాల వారు తెలుగుదేశం పార్టీలో మైదుకూరు టిడిపి ఇన్ చార్జీ మరియు మాజీ టిటిడి చైర్మన్ పుట్టా సుధాకార్ యాదవ్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో సోమవారం నాడు చేరారు. ఈ సందర్భంగా పుట్టా సుధాకార్ యాదవ్ మాట్లాడుతూ మాపై నమ్మకంతో పార్టీ లో చేరిన వారికి అన్ని విధాల ఆదుకొని,పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం ఇస్తానని అందరూ కలసి పనిచేసి వచ్చే ఎన్నికల్లో కష్టపడి నా గెలుపుకు కృషిచేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.కార్యక్రమంలో మండల అధ్యక్షులు తిపిరెడ్డి,లక్ష్మిరెడ్డి,ఐటిడిపి మండల అధ్యక్షుడు పాపన మల్లికార్జున రెడ్డి,ఖాజీపేట ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి,గంగిరెడ్డి రాజేష్ కుమార్ రెడ్డి(చిన్నా),కృష్ణారెడ్డి,సర్పంచ్ కొంగాని వెంకట సుబ్బయ్య,సిద్దారం ఖదిరుల్లా,జలీల్,తుట్టే రాము యాదవ్, వీరయ్య,బండి వెంకటేష్ ఈశ్వర్,తదితర నేతలు,కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

## మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

రాయచోటి, జనవరి 29, ప్రభాత వార్త :



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జనవరి 31వ తేదీన బుధవారం ఉదయం 9 గంటలకు అంగళ్లులోని స్థానిక విశ్వం డిగ్రీ అండ్ ఫీజీ కళాశాలలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని, నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్ తెలియజేశారు. ఈ మెగా జాబ్ మేళాలో బహుళ జాతీయ 20 కంపెనీలు పాల్గొచున్నాయని, వాటి ద్వారా నిరుదోఒ్యగ యువతి యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. మెగా జాబ్ మేళాకు 20 బహుళ జాతీయ కంపెనీలు పాల్గొనుచున్నాయన్నారు. హాజరయ్యే నిరుద్యోగ యువతీ యువకులు, విద్యార్హతలు 10వ తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లమా, బి ఫార్మీసీ, ఎం ఫార్మసీ, నర్సింగ్, ఎనీ డిగ్రీ, ఎనీ బిటెక్, పిజి చదివిన వారు 18 సంవత్సరాలు నుంచి 30 సంవత్సరాల వయసు కలిగిన అభ్యర్థులు అర్హులని, సెలెక్ట్ అయిన అభ్యర్థులకు నెలకు 10 నుండి 10వేల వరకు జీతం ఉంటుందని తెలియజేశారు. ఈ ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు ఖచ్చితంగా విద్యార్హత పత్రాలు జిరాక్స్, ఆధార్‌కార్డు, రెండు ఫోటోలతో అర్హత కలిగిన నిరుద్యోగ యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి హరికృష్ణ పాల్గొన్నారు.

## మహిళలకు వైసిపి ప్రభుత్వం పెద్దపీట

రైల్వేకోడూరు రూరల్, జనవరి 29 ప్రభాతవార్త



రైల్వేకోడూరు పట్టణంలో వైసిపి ప్రభుత్వం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించిన స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వాహ కులు పార్థసారథి ఆధ్వ ర్యంలో పలురకాల సన్మాన కార్యక్రమాలను అత్యంత వైభవోపేతంగా నిర్వ హించారు. రైల్వేకోడూరు మండలంలోని గిరిజమ్మ వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన పార్థసారధి నేతృత్వంలో సిద్దార్థ జ్ఞాపకార్థంగా మగ్గం వర్క్ మెటీరియల్ ఉచితంగా పంపిణీ కార క్రమానికి రైల్వేకోడూరు ఉపసర్పంచ్ తోట శివసాయిని అత్యంత వైభవోపేతంగా సన్మానించారు. ఈ సందర్భంగా తోట శివసాయి మాట్లాడుతూ మహిళలకు నిర్వహిస్తున్న మగ్గం నిర్వహణ ద్వారా వందలాది మహిళలకు ఎంతో ఉపాధి కల్పిస్తున్న సందర్భంలోమహిళలు ఉపసర్పంచ్ తోట శివసాయిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపసర ్పంచ్ తోట శివసాయి మాట్లాడుతూ మహిళలకు ఉపాది కల్పించడంలో కొండూరు అజయ్ రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, ఎంపి మిథున్‌రెడ్డిలు చేస్తున్న కృషి అభినందనీయమని వారు పేర్కొన్నారు. ముఖ్యంగా రైల్వే కోడూరు మండలంలో స్కిల్‌డెవలప్‌మెంట్ ద్వారా వందలాది మహిళలకు నిర్వాహకులు పార్థసారధి చేస్తున్న కృషి అభినందణీయమన్నారు. ఈ కార్యక్రమం లో రైల్వేకోడూరు మండల పంచాయతికి చెందిన కార్యదర్శులు, వార్డుమెంబర్లు పాల్గొన్నారు.

## జాతీయ కబడ్డీ పోటీల్లో ఆంధ్రా, తెలంగాణ జట్ల గెలుపు

రాజంపేట అర్బన్, జనవరి 29 ప్రభాతవార్త

రాజంపేటలో జరుగుతున్న జాతీయస్థాయి అండర్–14 కబడ్డీ పోటీల్లో సోమవారం దక్షిణాది రాష్ట్రాల గెలుపొందాయి. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కేరళా రాష్ట్రాలు విజయం సాధించాయి. బీహార్ – విద్యాభారతి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 4 పాయింట్ల తేడాతో బీహార్ విజయం సాధించింది. పశ్చిమ బెంగాల్ – పంజాబ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 5 పాయింట్ల తేడాతో పంజాబ్ గెలిచింది. జమ్మూ – తమిళనాడు మధ్య మ్యాచ్‌లో తమిళనాడు ఘన విజయం సాధించింది. ఏకంగా 63 పాయింట్ల తేడాతో విజయదుందుబి మోగించింది. కేరళా – చండీఘర్ మధ్య జరిగిన మ్యాచ్‌లో కేరళా జట్టు 34 పాయింట్ల తేడాతో విజయకేతనం ఎగురవేసింది. కర్ణాటక – హర్యాన మధ్య జరిగిన మ్యాచ్‌లో 66 పాయింట్ల భారీ తేడాతో హర్యాన విజయదుందుబి మోగించింది. విద్యాభారతి – కెవిఎస్ మధ్య జరిగిన మ్యాచ్‌లో విద్యాభారతి 11 పాయింట్ల తేడాతో గెలుపొందింది. ఉత్తరప్రదేశ్ – ఎన్‌విఎస్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్ గెలుపొందింది. ఆంధ్రప్రదేశ్ – సిఐ ఎస్‌సిఇ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ 9 పాయింట్ల తేడాతో గెలుపొందింది.

# ప్రవీణ్ టిడిపి అభ్యర్థి అంటూ పోస్టర్లు వేయించడం తగదు

## మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య



ప్రొద్దుటూరు, జనవరి 29, ప్రభాతవార్త

ప్రొద్దుటూరు టిడిపి అభ్యర్థి జీవి ప్రవీణ్‌కుమార్ రెడ్డి అని పోస్ట ర్లు వేయించి టిడిపి కార్యకర్తలను, నాయకులను గందరగోళానికి గురి చేయడం అభ్యర్థి రేసులో ఉన్న నాయకులకు తగదని అధినాయ కత్వం ప్రకటించేంతవరకు హుందా తనంగా మెలగాలని మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య సూచించారు. సోమవారం స్థానిక మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి కార్యాలయంలో స్థానిక నాయకులతో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు నియోజికవర్గంలో తెలుగుదేశం పార్టీ అత్యం త బలోపేతంగా ఉన్న నేపధ్యంలో ఇలాంటి పోస్టర్లు టిడిపి కార్యకర్తలకు, నాయకులకు గందర గోళానికి గురిచేస్తాయన్నారు. నిజంగా ప్రవీణ్‌రెడ్డికి టికెట్ ఖరారు చేసి ఉంటే టిడిపి అధినాయకత్వమే అందరితో చర్చించి ప్రకటిస్తుందని తెలిపారు. అలా ప్రక టించేంతవరకు అభ్యర్థి రేసులో ఉన్న నాయకులు హుందా గా నడుచుకొని ప్రొద్దుటూరు నియోజికర్గంలో తెలుగుదేశం పార్టీ విజయంకోసం కృషి చేయాలన్నారు. మాజీ టిడిపి పట్టణ అధ్యక్షులు ఘంటసాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్థానిక టిడిపి ఇంచార్జ్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి టికెట్ రాదేమోనన్న అభద్రతాభావం నెల కొందేమోనన్న అనుమానం వ్యక్తం చేశారు. అందుకే టిడిపి అభ్యర్థి జీవి ప్రవీణ్‌కుమార్ రెడ్డికి ఓటు వేయాలని పోస్టర్లు వేయించినట్లు తెలు స్తోందన్నారు. జిల్లాలోని మైదుకూరు, పులివెందుల, కమళాపురంలలో అభ్యర్థులు సింగల్ గానే ఉన్న వారు అభ్యర్థులమని పోస్టర్లు వేసుకోలేదన్నారు. పోస్టర్ల వల్ల టిడిపి నాయకులకు, కార్యకర్తలను గందరగోళ పరిస్థితి తీసుకు రావద్దని టిడిపి ఇంచార్జీకి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నాయకులు వద్ది బాలుడు, అమీర్, కోటవీధి దస్తగిరి పాల్గొన్నారు.

# ఆల్‌ఇండియా దోభీ మహాసంగ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కృష్ణయ్య



పోరుమామిళ్ళ రూరల్, జనవరి 29, ప్రభాతవార్త

ఆల్ ఇండియా ధోబి మహా సంగ్ రాష్ట్ర సమావేశం విజయవాడ ప్రెస్ క్లబ్ నందు జరిగినది. అందులో కడప జిల్లా బి.కోడూరు మండలం అయిత్రం పేట గ్రామానికి చెందిన గోవిందాయపల్లి కృష్ణయ్యను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఈ పదవికి ఎంపిక చేసిన జాతీయ అధ్యక్షులు కృష్ణకుమార్ కనోజియా.జూపల్లి సత్యనారాయణ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుకూరి శంఖర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు,జిల్లెల్ల శ్రీరాములు, జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్‌కి నాకు ఈ పదవి ఇచ్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయబడింది,నియమ నిభందనలకు కట్టుబడి సంఘము పోరాటంలో నా వంతు కృషి చేస్తానని తెలియజేయడమైనది.

# భూ నిర్వాసితులకు పరిహారం అందజేయాలి

## - పాదయాత్రలో భూపేష్‌రెడ్డి



జమ్మలమడుగు, జనవరి 29, ప్రభాతవార్త

రాజోలి ప్రాజెక్టు కింద భూ నిర్వాసితుల పరిహారం కోసం జమ్మలమడుగు తెదేపా ఎమ్మెల్యే అభ్యర్థి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బ రామిరెడ్డి సోమవారం పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయ నకు నాయకులు, కార్యకర్తలు, ప్రజ లు ఘన స్వాగతం పలికారు. ముందుగా ఆయన పెద్దముడి యంలో పార్టీ కార్యా లయాన్ని ప్రారంభించి సుంకులమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం భూ నిర్వా సితులను పట్టించుకోవడం లేదని తక్షణం వారికి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీలు దేవగుడి నారాయణరెడ్డి, శివనాథరెడ్డి, రమణా రెడ్డి, నియో జకవర్గ తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నంది అవార్డు గ్రహీత ప్రమీళకు సన్మానం



పీలేరు, జనవరి 29 ప్రభాతవార్తః

స్థానిక ఆర్టీసీ డిపో నందు కండెక్టరుగా విధులు నిర్వర్తిస్తున్న గండికోట ప్రమీళ ఈనెల 27వ తేదీన హైదరాబాదు రవీంద్ర భారతి లో నంది అవార్డు అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వారి ఆధ్వర్యంలో సీనియర్ హీరోయిన్ పూర్ణిమ, ప్రొడ్యూసర్ రామసత్యనారాయణ, దైవజ్ఞశర్మ, ఆస్ట్రాలజిస్టు ప్రొడ్యూసర్, డైరెక్టర్ హీరో కపిల్‌దేవ్, విజయకుమార్, సినీ నిర్మాత దయానంద్ చేతుల మీదుగా నంది అవార్డును ప్రమీళ అందుకున్నారు. ఈమె అనేక రకాల పాటలు క్లాసికల్ , లైట్ మ్యూజిక్, జానపదాలు, కోలాటాలు నేర్పించడం చేస్తూ ఆర్టీసీలో కండెక్టరుగా విదులు నిర్వహిస్తూ అందరి మన్ననలతో ముందుకు దూసుకెళ్తున్న ప్రమీళను స్థానిక సర్పంచి జీనత్‌షఫీ పంచాయతీ కార్యాలయంలో ప్రమీళ దంపతులను సోమవారం సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కళను కూడా చక్కగా ప్రదర్శిస్తూ అందరికి స్ఫూర్తిదాయ మన్నారు. ఆమె భర్త ఆనంద్‌బాబు స్థానిక ఆర్టీసీ మెకానిక్‌గా పనిచేస్తున్నారు.

# మద్యం బాటిళ్లు స్వాధీనం కేసు నమోదు

దువ్వూరు, జనవరి 29, ప్రభాతవార్త

మండల పరిధిలోని రెండు గ్రామాల్లో దాడులు చేసి 32 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. కానగూడూరుకు చెందిన పామిలేటి అనే వ్యక్తి వద్ద నుంచి 20 మద్యం బాటిళ్లు నీలాపురం సుబ్బరాయుడు వద్ద నుంచి 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# నూతన కమిషనర్‌గా జబ్బార్ మియా

మైదుకూరు జనవరి 29, ప్రభాత వార్త



మైదుకూరు నూతన మున్సిపల్ కమిషనర్‌గా జబ్బార్‌మియా సోమవారం పదవీ బాద్యతలు స్వీకరించారు. చిత్తూరు మునిసిపల్ అర్బన్ డేవల ప్మెంట్ అడ్మినిస్ట్రేషన్ నుండి మైదుకూరుకు వచ్చారు.ఇక్కడ డిప్యూటేషన్ మీద వచ్చిన రంగస్వామి ప్రొద్దుటూరు సోంత స్థానానికి వెళ్లారు.

# మున్సిపల్ కమిషనర్‌గా వి.మల్లికార్జున బాధ్యతలు

ప్రొద్దుటూరు, జనవరి 29, ప్రభాతవార్త



ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్‌గా వి.మల్లికార్జున సోమవారం బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మిదేవి నాగరాజును మర్యాద పూర్వకంగా కలిశారు. బాధ్యతలు చేపట్టిన కమిషనర్‌ను ఆమె అభినందనలు తెలిపారు. మున్సిపల్ వివిధ విభా గాల అధిపతులు కమిషనర్‌కు ఘనంగా స్వాగతం పలికారు.

# హెల్పింగ్ మైండ్ సేవలకు అబూకు ఆర్డీఓచే ప్రశంసాపత్రం

మదనపల్లెక్రైం, జనవరి 29 ప్రభాతవార్త :



హెల్పింగ్ మైండ్స్ సంస్థ అధినేత అబూబక్కర్ సిద్దిక్ జిల్లా, నియోజకవర్గ, పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. పలు రకాల సేవా కార్యక్రమాలు చేపట్టిన ఈ సంస్థ అత్యుతమ సేవలకు గానూ సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎంఎస్.మురళి చేతుల మీదుగా హెల్పింగ్‌మైండ్ వ్యవస్థాపకులు అబూబక్కర్ సిద్దిక్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

# రామయ్యకు ఫించన్ అందజేస్తాం

ములకలచెరువు, జనవరి 29 ప్రభాతవార్త :



పిటిఎం మండలంలోని కమ్మ చెరువు పంచాయితీ మోరుసుపల్లెకు చెందిన పెద్దపాళ్యం రామయ్య ఫించను తొలగించలేదని ప్రతినెలా ఫించన్ పంపిణీ చేస్తామని ఎంపిపి మొహమూద్ అన్నారు. సోమవారం పిటిఎం ఎంపిపితో పాలు పలువురు నాయకులు, పంచాయతీ కార్యదర్శితో కలసి రామయ్య ఇంటికి చేరుకొని విచారించారు. మూడు నెలలుగా వేలిముద్ర వేయించుకొంటున్నా నగదు పించన్ ఇవ్వకుండా వెలుతున్నాడని రామయ్య తెలిపారు. దీంతో రామయ్య వాలంటీర్‌ను నిలయదీయగా ఎమ్మెల్యే ఆదేశాల ప్రకారమే ఫించన్, బియ్యం ఇవ్వడం లేదని వాలంటీర్ తెలిపినట్లు చెప్పాడు. ఫించన్ తొలగించలేదని వాలంటీర్ చేఇసన తప్పిదేమి లేదని తెలిపారు. కార్యక్రమంలో కందుకూరు సర్పంచ్ రహంతుల్లా, మండల కన్వీనర్ గణపతిరెడ్డి, నాయకులు బాబురెడ్డి, వెంకటసుబ్బారెడ్డిలు పాల్గొన్నారు.

# మిట్స్‌లో ప్యాకల్టి డెవలప్‌మెంటు కార్యక్రమం

కురబలకోట, జనవరి 29 ప్రభాతవార్త:



మిట్స్ కళాశాలలో ఐదు రోజులు పాటు నిర్వహించే ప్యాకల్టి డెవలప్‌మెంటు ప్రోగ్రామ్‌ను సోమవారం ముఖ్య అతిధి డాక్టర్ అరవింద్ ప్రారంభించారు. క్వాంటమ్ కంప్యూటింగ్ అండ్ లిఫ్ట్ రెవలెషన్‌రి అప్లికేషన్ అనే అంశంపై అనంతపురం జేఎన్‌టియులో మిట్స్ కళాశాల సంయుక్తంగా జాతీయస్థాయిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రొపెసర్ డాక్టర్ అరవింద్ మాట్లాడుతూ కొత్త సూపర్‌ఫాస్ట్ క్వాంటమ్‌ప్రాసెసర్‌ను డెవలప్ చేసింది ప్రముఖ ఐబిఎం కంపెనీ ప్రపంచంలో ఏ ప్రాసెస్‌తో పోల్చుకొన్న ఇది అతిపెద్ద టిడ్‌కౌంట్ కలిగి ఉంటుదన్నారు. ఇందులో ముఖ్యమైనది క్వాంటమ్‌బిట్స్ ప్రతికంప్యూటర్ జీరో, ఒకటిపై ఆదారపడి పనిచేస్తాయన్నారు.క్వాంటమ్‌బిట్స్ అంటే లాసిక్ కంప్యూటిరింగ్‌కు ప్రాససర్లు ఒకే సమయంలో జీరోతో పాటు ఒకటిని సూచిస్తాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం క్వాంటమ్ కంప్యూటీకరణకు రూ.6వేలకోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ రామనాథం, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన ప్రశాంత్

పీలేరు, జనవరి 29 ప్రభాతవార్త



పీలేరుకు చెందిన ఎస్సీ మాదిగ విద్యార్థి ప్రశాంత్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైయ్యారు. మండలంలోని ముదుపుల వేముల గ్రామం విద్యానగర్ మాదిగ పల్లెకు చెందిన పల్లెపాగు శ్రీనాద్ చిత్తూరు ఉమ్మడి జిల్లా డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూటర్ సీనియర్ ఏపీపీగా విదులు నిర్వహించి రిటైర్డు అయ్యారు. ఆయన కుమారుడు పల్లెపగు ప్రశాంత్ హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీ లో మాస్టర్ ఆఫ్ లా కోర్సు చదివి 2017లో న్యాయవాధిగా తిరుపతిలో ప్రాక్టీస్ ప్రారంభించారు. తరువాత తెలంగాణ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులలో న్యాయవాధిగా ప్రాక్టీస్ చేసున్నారు. శుక్రవారం జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎంపికైన వారి వివ రాలు రాష్ట్ర హైకోర్టు విడుదల చేసింది అందులో ప్రశాంత్ ఒక్కరు, ఈసంద ర్భంగా నూతనంగాఈ ఎంపికైన జడ్జి ప్రశాంత్ తండ్రి శ్రీనాధ్ మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గత 30, 40 సంవత్సరాలుగా ఎస్సీ మాదిగ జడ్జి ఇంతవరకు ఎవరు లేరని నా కుమారుడిని కష్టపడి చదివించినందుకు నా కష్టాన్ని వమ్ము చేయకుండా జడ్జి అయినందుకు చాలా గర్వంగా ఉందని అందరు తల్లిదం డ్రులు వాళ్ల పిల్లలు ప్రయోజకులు కావాలనే చదివిస్తారు. కానీ కొంతమంది మాత్రమే తల్లిదండ్రుల ఆశయాలు నిలబెట్టేందుకు చెడు వ్యసనాలకు లోను కాకుండా ఏకాగ్రతతో బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదుగుతారని తెలిపారు. జడ్జి ప్రశాంత్‌కు ఎంఆర్‌పీఎస్ నాయకులు, ఎంఎస్‌పీ పీలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గండికోట వెంకటేష్ అభినందనలు తెలిపారు.

# వైవీయూలో అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు

వైవీయూ జనవరి 29, ప్రభాతవార్త



యోగి వేమన విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్లుగా పదోన్నతుల ప్రక్రియ నిర్వహించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్, కుల సచివులు ఆచార్య వైపి వెంకటసుబ్బయ్య, ప్రధానాచార్యులు ఎస్ రఘునాథరెడ్డి , రాష్ట్ర గవర్నర్ నామిని, జాతీయ సంస్థలు, రాష్ట్ర రాష్ట్రేయతర విశ్వవిద్యాలయాల సబ్జెక్టుల నిపుణులు, వై వి యూ లోని ఆయా సబ్జెక్టుల డీన్లు, అధిపతులు, ఎస్సీ, ఎస్టీ ,ఓబీసీ నామినీల సమక్షంలో ఇంటర్వ్యూలు జరిగాయి. ఇంగ్లీష్, మ్యాథమెటిక్స్, పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, కెమిస్ట్రీ, ఫిజిక్స్, బయోటెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్స్ సబ్జెక్టుల్లోని అసోసియేట్ ప్రొఫెసర్లు కెరీర్ అడ్వాన్స్ మెంట్ స్కీమ్ (సి.ఎ.ఎస్) ద్వారా ప్రొఫెసర్లుగా పదోన్నతి కోసం హాజరయ్యారు.

# మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి సేవలు అభినందనీయం

## వీడ్కోలు సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాజ గోపాల్‌రెడ్డి



బద్వేలు రూరల్, జనవరి29 ప్రభాతవార్త

బద్వేలు మున్సిపల్ కమిషనర్ కల్లూరి వెంకటక్రిష్ణారెడ్డి సేవలు అభినందనీయమని మునిసిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి, వైస్‌చైర్మన్‌లు గోపాల స్వామి, సాయిక్రిష్ణ,లతో పాటు పలువురు కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ కల్లూరి వెంకట క్రిష్ణారెడ్డి 2019లో కళ్యాణ దుర్గం నుంచి బద్వేలు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టి సుమారు నాలుగున్నర సంవత్సరాల పాటు మున్సి పాలిటీలో మెరుగైన సేవలందించి ప్రజల మన్ననలు పొందారన్నారు. విధినిర్వహణలో తూ.చ. తప్పక తన కర్తవ్యాన్ని నిక్కచ్చిగా వ్యవహరిస్తూ మార్నింగ్ వాక్ నుండే మున్సిపాలిటీలోని అన్ని వార్డులలో ఎక్కడ ఏ సమస్య తన దృష్టికి వచ్చినా అక్కడ నెలకొన్న పారిశుధ్య, నీటి సమస్యలు తక్షణమే పరిష్కరించేలా ప్రజలకు మెరుగైన సేవలందించారన్నారు. ఎన్నికల దృష్ట్యా సాధారణ బదిలీలలో భాగంగా బద్వేలు నుంచి నెల్లూరు జిల్లా కందుకూరు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీకావడంతో సోమవారం కమిషనర్ కృష్ణారెడ్డిని పలువురు శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఈ సుమన్‌రెడ్డి, ఏఈలు జగదీష్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మినారాయణ, ఇన్‌చార్జి ఆర్‌వో సుధీర్, సీ1 శ్రీనివాసులు, సీ 2 పవన్, అకౌంటెంట్ జో్యతి లక్ష్మి, టీపీవో చంద్రమోహన్, ఆర్ఐ లు ఖాజా హుసేన్, రెడ్డి కుమార్, టీపీపీవో నరసయ్య, జయరామిరెడ్డి,డీపీవో సునీల్‌కుమార్ లతో పాటు వైసీపీ నాయకులు పుత్తా శ్రీరాములు , సుబ్బారెడ్డి, పంగా చెన్నక్రిష్ణారెడ్డి , మున్సి పల్ మేస్త్రీలు ప్రసాద్, విష్ణు, నాగేంద్ర, వాటర్ సూపర్‌వైజర్ ఆవులేటి బాబి, లైటింగ్ సెక్షన్ ప్రసాద్‌తో పాటు పలువురు మున్సిపల్ సిబ్బంది నాయకులు పాల్గొనా న్నరు.

# రితీష్‌రెడ్డిని కలిసిన కలసపాడు వైసీపీ నేత భూపాల్‌రెడ్డి

బద్వేలు, జనవరి29 ప్రభాతవార్త



కలసపాడు వైసీపీ నాయకులు, మాజీ జడ్పీటీసీ భూపాల్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువనేత రితేష్‌రెడ్డిని వారి స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. కలసపాడు తెలుగుదేశం నాయకులతో కలిసి భూపాల్‌రెడ్డి యువనేత రితేష్‌రెడ్డి స్వగృహానికి వెళ్లి కలిసినట్లు తెలుస్తోంది. త్వరలో తెలుగుదేశం తీర్థం పుచ్చుకోనున్నట్లు సమాచారం. ఈ మేరకు ఇప్పటికే పార్టీ నేతలకు సమాచారాన్ని చేరవేసినట్లు తెలుస్తోంది. కలసపాడులో భూపాల్‌రెడ్డి చేరితే పట్టుకోల్పోయే అవకాశం లేకపోలేదని నేతలు అంటున్నారు. ఇప్పటికే కలసపాడులో వైసీపీనుంచి తెలుగుదేశానికి అనేకమందిని చేర్చే ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తోంది.

# వాసవి క్లబ్ నూతన కమిటి ఎన్నిక



బద్వేలు రూరల్, జనవరి29 ప్రభాతవార్త

వాసవిక్లబ్ 2024 సంవత్సరం నూతన కమిటిని ఎన్ను కోవడం జరిగింది. వాసవిక్లబ్ అధ్యక్షు లుగా మేధాహల్ భార్గవ్, సెక్రటరీగా పెసల సుధాకర్, ట్రెజరర్‌గా కనమర్లపూటి వినోద్ కుమార్‌ను ఎన్నుకోవడం జరిగిందని , వాసవిక్లబ్ మాజీ అధ్యక్షులు కేవి.సుబ్బారావు, చాటకొండు వెంకటసుబ్బయ్య , వైభవ్ ప్రసాద్, కొలిశెట్టి సుబ్బారావు, తిరువీధి మురళి క్రిష్ణ, చిందుకూరి శివతో పాటు పలువురు తెలిపారు. బద్వేలు పట్టణంలో నిరుపేద ఆర్యవైశ్యులను గుర్తించి వారికి వాసవిక్లబ్ ద్వారా చేయూతనిచ్చేలా కృషిచేయాలన్నారు. అనంతరం నూతన కమిటి గా ఎన్నికైన వాసవిక్లబ్ అధ్యక్షులు మేధాహల్ భార్గవ్, సెక్రటరీగా పెసల సుధాకర్, ట్రెజరర్‌గా కనమర్లపూటి వినోద్‌కుమార్ మాట్లాడుతూ వాసవిక్లబ్ నూతన కమిటిగా తమను ఎన్నుకోవడం సంతోషంగా ఉందన్నారు. బద్వేలు ప్రాంతంలో పలువురి దాతల సహకారంతో వాసవిక్లబ ద్వారా గతంలో ఎన్నడూ లేని విధంగా నిరుపేద ఆర్యవైశ్యులను గుర్తించి వారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందించడంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తా మన్నారు. తమను నూతన కమిటిని ఎన్నుకోవడం పట్ల పలువురికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

# జగన్‌ను ఓడించేందుకు ప్రజలు సిద్ధం

## టిడిపి జిల్లా అధ్యక్షుడు జగన్‌రాజు

రాజంపేట అర్బన్, జనవరి 29 ప్రభాతవార్త



ప్రతిపక్షాలతో ఎన్నికల యుద్ధానికి సిద్ధమంటూ వైజాగ్‌లో శంఖారావం పూరించిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు కూడా సిద్ధంగా ఉన్నారని తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్ రాజురాజు ఎద్దేవా చేశారు. అరాచక వైకాపా ప్రభుత్వానికి 74 రోజులు మాత్రమే గడువు ఉందని దిగడం ఖాయమని జోష్యం చెప్పారు. సోమవారం రాజంపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్‌ఆర్‌సిపి దురాగాతాలకు ప్రజా కోర్టులోనే శిక్షపడే సమయం ఆసన్నమైందని అన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా జగన్‌రెడ్డి పరిపాలనకు స్వస్తి పలకడానికి యువత, రైతులు, ప్రజలు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులంతా ముక్తకంఠంతో సిద్ధంగా ఉన్నారని, వైసిపికి కౌంట్‌డౌన్ మొదలైందని పేర్కొన్నారు. ఎన్నికల ముందు నా ఎస్‌సి, నా ఎస్‌టి, నా మైనార్టీలు అంటూ ప్రగల్బాలు పలికిన జగన్‌రెడ్డి నేడు దళిత అభ్యర్థులను మాత్రమే మార్చడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. ఎర్రచందనంతో మీకున్న సంబంధాలు నిజం కాదా..? మీ ఆత్మీయుడైన ఎర్రచందనం స్మగ్లర్ విజయానందరెడ్డికి వైసిపి టిక్కెట్ కేటాయించడమే ఇందుకు నిదర్శనం కాదా అన్నారు. వైకాపా అసమర్ధ పరిపాలన వల్లే రాష్ట్రంలో అప్పులు పెరిగి వాటికి వడ్డీలు భారీగా పెరగడంతో అధిక భారం ప్రజలపైన పడుతుందని ఒకప్పుడు 200 రూపాయలు ఉన్న బిల్లులు ఇప్పుడు ఐదు రెట్లు పెరిగి 1000కి చేరిందని విమర్శించారు. గత టిడిపి ప్రభుత్వంలో లేని అప్పులు, కష్టాలు ఇప్పుడు ఎందుకు వచ్చాయో ప్రజలే ఆలోచించుకోవాలని, మద్యం, నిత్యావసర ధరలు, ఆర్‌టిసి బస్సు చార్జీలను పెంచుతూ వైసిపి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను దోచు కుంటుందని ధ్వజమెత్తారు. వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు ఒక ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదని, అదే టిడిపి అధికారంలో ఉంటే సాగునీటి ప్రాజెక్టులన్ని పూర్తి చేసేవారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు, పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కోవూరు సుబ్రహ్మణ్యంనాయుడు, మండల పార్టీ ఉపాధ్యక్షులు సతీష్‌రాజు, తులసి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపరాదు

## - జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్



రాయచోటి, జనవరి 29, ప్రభాత వార్త :

జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమంలో అందిన ప్రజల సమస్యలపై నిర్లక్ష్యం చూపరాదని, ఎప్పటికప్పుడు నాణ్యతగా వాటిని పరిష్కరించాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలు నందు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ. జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డిఆర్‌ఒ సత్యనారాయణ, ఎస్డిసి శ్రీలేఖలులతో కలిసి ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుల విజ్ఞప్తులను సంబంధించి అధికారులు, క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. నిర్ణత గడువులోపు అర్జీదారులు సంతృప్తి చెందేలా చూడాలని, పెండింగ్, బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్ లేకుండా పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు. ఈ స్పందనకు మదనపల్లె, చిట్వేల్, రాజంపేట, తదితర ప్రాంతాల నుండి మదనపల్లి నుండి చేనేత, చిట్వేల్ నుండి పక్షవాతం ఉన్న వారికి ఉద్యోగం కల్పించాని, రాజంపేట నుండి భర్త మరణంతో భార్యకు ఉద్యోగం కావాలని కలెక్టర్‌కు అర్జీలు వచ్చాయి. ఈ స్పందన కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# టిడిపి యువకుల సేవలు అపూర్వం

## - మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి

రాయచోటి, జనవరి 29, ప్రభాత వార్త :



రాయచోటి నియోజకవర్గంలోని యువకులు మన టిడిపి యాప్ ఉపయోగించి రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి అక్రమాలు, అరాచకాలు ప్రజలకు చేరవేస్తూ అహర్నిశలు పని చేశారని, వారి సేవలు అపూర్వమని రాయచోటి నియోజక వర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఆర్. రమేష్ కుమార్‌రెడ్డి అన్నారు. రాయచోటి పట్టణం బోస్‌నగర్‌లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం మన టిడిపి యాప్ చురుగ్గా చేసిన వారిని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం గుర్తించి వారికి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం గుర్తించి వారికి తెలుగుదేశం పార్టీ సింబల్ సైకిల్‌ను బహుమతిగా పంపించారు. వాటిని రాయచోటి నియోజకవర్గంలో ఉత్సాహంతో పార్టీ కోసం పని చేసిన వంగిమళ్ల నాగభూషణరెడ్డి, రాయచోటి నియోజకవర్గంలో ప్రథమ స్థానంలో ఉండగా ద్వితీయ స్థానం గణేష్ తృతీయ స్థానం సుబ్బయ్య నాయుడులకు దక్కింది. మరో 17 మందికి ఉన్నారు. యువకులు మరింత ఉత్సాహంతో తెలుగుదేశం పార్టీ కోసం పని చేసే తెలుగుదేశం పార్టీ అత్యధిక మెజార్టీతో విజయం సాధించే విధంగా పని చేయాలని ఈ సందర్భంగా రమేష కుమార్‌రెడ్డి మన టిడిపి యాప్ యువకులను కోరారు. నియోజకవర్గంలో రమేష్‌కుమార్‌రెడ్డిని, రాష్ట్రంలో చంద్ర బాబు నాయుడును అధికారంలోకి వచ్చే విధంగా అహర్నిశలు కృషి చేస్తామని యువకులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి గాజుల ఖాదర్‌బాష, పట్టణ అధ్యక్షుడు ఖాదర్ వలి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

# ఫిర్యాదు దారులకు సత్వర న్యాయం చేకూర్చాలి

## జిల్లా ఎస్పీ కృష్ణారావు



రాయచోటి, జనవరి 29, ప్రభాత వార్త :

స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి ఫిర్యాదు దారులకు సత్వర న్యాయం చూకూర్చాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన స్పందనకు 50 ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన తెలిపారు. స్పందన కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులపై సకాలంలో స్పందించి చట్ట ప్రకారం పరిష్కారం చూపాలని ఆయా అర్జీలకు ప్రాధాన్యత ఇచ్చి నిర్ణీత సమయంలోగా విచారించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని తెలిపారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు వారి సమస్యలను స్వయంగా జిల్లా ఎస్పీకి విన్నవించుకున్నారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలు పరిష్కరించేందుకు నిర్వహించిన స్పందన కార్యక్రమలో ఫిర్యాదు దారులతో ముఖాముఖి మాట్లాడారు. బాధితు లకు న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు. ఎప్పటికప్పుడు పోలీసు ప్రధాన కార్యాలయానికి అందించాల్సిందిగా పోలీసు అధికారులను ఆదేశించారు.

# ఎమ్మెల్యే రాచమల్లు మాటలు నమ్మి మోసపోవద్దు

## స్థానిక వ్యాపారులకు ప్రవీణ్‌రెడ్డి విజ్ఞప్తి

ప్రొద్దుటూరు, జనవరి 29, ప్రభాతవార్త



ప్రొద్దుటూరు పట్టణంలో కార్పొరేట్ వ్యవస్థలు రాకుండా మున్సిపల్ తీర్మాణం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి స్థానిక వ్యాపారు లకు తోడుగా నిలుస్తానన్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి మాటలు నమ్మి మోసపోవద్దని టిడిపి ఇన్చార్జ్ జీవి ప్రవీణ్‌కుమార్ రెడ్డి వ్యాపారులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల సీఎంఆర్ అనే కార్పొరేట్ వస్త్ర వ్యాపారులు ప్రొద్దుటూరు పట్టణంలో షాపింగ్ మాల్ ప్రారంభిం చిన సంగతి తెలిసిందే అన్నారు. ఈ కార్పొరేట్ సంస్థ రావడంతో స్థానిక వస్త్ర వ్యాపారుల వ్యాపారాలు కుదేలైనట్లు సంఘాలు ఎమ్మెల్యే, ఎంపీ దృష్టికి తీసుకెళ్లారన్నారు. నిజంగా ఎమ్మెల్యే, ఎంపీకి వ్యాపారులకు తోడుగా నిలవాలన్న చిత్తశుద్ధి ఉంటే సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభం కావడానికి ముందు మున్సి పాలిటీ వ్యాపార అనుమతులు ఎలా మంజూరు చేస్తారని ప్రశ్నించారు. కేవలం ఎంపీ, ఎమ్మెల్యేలు స్థానిక వ్యాపారులను మభ్యపెట్టి మోసం చేయడమేనని విమర్శించారు. ఎంపీ, ఎమ్మెల్యేల ఇలాంటి మోసపూరితమైన మాటలను నమ్మి స్థానిక వ్యాపారులు మోసపోవద్దని ఆయన సూచించారు. ప్రొద్దుటూరు నియోజిక వర్గ అభివృద్ధిపై కాని, దౌర్జన్యం అరాచకాలు, అసాంఘీక కార్యకలాపాల పైన కానీ చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, ఈ చర్చలో పాల్గొనేందుకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి రావాలని ఆయన పిలుపు నిచ్చారు. పట్ట ణంలో టిడిపి అభ్యర్థి ప్రవీణ్‌రెడ్డి అని వెలసిన పోస్టర్లపై స్థానిక టిడిపి నాయకులు చేసిన వ్యాఖ్యలపై విలేకరులు ప్రశ్నించగా టిడిపి అధిష్టానం తనకు టికెట్ ఖరారు చేసినట్లు తెలిపిందని ఏదైన అభ్యంతరాలు ఉంటే అధిష్టానానికి ఫిర్యాదు చేయవచ్చని ఆయన పేర్కొన్నారు.